PRAMUKHANDHRA    28th Year of Publication    We carry the news and views of Telugus




# ప్రముఖాంధ్ర

28 వ సంవత్సరం

వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీ రామారావు

₹.15
మే 2022



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

# ప్రపంచ తెలుగు సమాఖ్య

## 29వ వార్షికోత్సవ వేడుకలు












ప్రపంచ తెలుగు సమాఖ్య వేడుకలు డాక్టర్ వి ఎల్ ఇందిరా దత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా భారత ప్రధాన న్యాయమూర్తి శ్రీ నూతలపాటి వెంకటరమణ , గౌరవ అతిథిగా మద్రాసు హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ మునీశ్వర్ నాథ్ భండారి పాల్గొన్నారు. అతిథులను అధ్యక్షులు ఇందిరాదత్, ఉపాధ్యక్షులు కవితాదత్, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివరామప్రసాద్ శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు.

సమాఖ్య అధ్యక్షులు ఇందిరాదత్ స్వాగతోపన్యాసంలో గత రెండేళ్ళుగా కరోనా కారణంగా ప్రత్యక్ష కార్యక్రమాలు నిర్వహించకపోయినా అంతర్జాలం ద్వారా కార్యక్రమాలను నిర్వహించామని, పలు సహాయ కార్యక్రమాలను తెలుగు రాష్ట్రాలలో అందించామని తెలియజేసారు.

ఈ వేడుకల సందర్భంగా యార్లగడ్డ శంభూప్రసాద్ స్మారక పురస్కారం గా స్పాస్టిక్ సొసైటీ దివ్యాంగులు పునర్విక, స్వప్నకొండయ్యలకు ,గుమ్మడి వెంకటేశ్వరరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ తెలంగాణ జానపద గాయకుడు నాగేశ్వరరావు (70), రాజ వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వరప్రసాద్, శ్రీమతి రాజా వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ పురస్కారాన్ని పదోతరగతి విద్యార్థిని నిమ్మకాయల శిరీషకు ,వేమిరెడ్డి శ్యామలమ్మ పురస్కారాన్ని ఫుట్ బాల్ క్రీడాకారిణి శ్వేతకు సహాయాన్ని అతిథుల చేతుల మీదుగా అందజేసారు. కార్యక్రమంలో ముందుగా కలైమామణి ఉమా మురళి కూచిపుడి నృత్యం సభికులను అలరింపజేసింది. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పి వి సాయి, వార్షిక నివేదికను శివరామప్రసాద్, వందన సమర్పణను డి ఎల్ ఎన్ రెడ్డి నిర్వహించారు.

శ్రీ నూతలపాటి వెంకట రమణగారు తన ప్రసంగంలో తెలుగువారంతా తమ పిల్లలకు తెలుగును నేర్పించాలని , వారిని తమ స్వగ్రామాలకు తీసుకువెళ్ళి తాము పడిన కష్టాలను ,సంస్కృతి సాంప్రదాయాలను నేర్పాలని అప్పుడే తెలుగు భాష అభివృద్ధి చెందగలదని చెప్పారు. ఈ విషయంలో మనం తమిళవారికున్న శ్రద్ధ ప్రశంసనీయమన్నారు, నాకు అదే అనిపించింది మాతృభాష పట్ల తమిళులకున్న ప్రేమ గౌరవం తో పోలిస్తే మనం వెనుకబడి వున్నాం.




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

మే 2022

సంపుటి : 28 **329** సంచిక : 5




# స్వర్ణయుగానికి నూతనశతాబ్ది పునాది కావాలి!

Life for Just Living బ్రతకడానికే జీవితం అనేది మనిషి ధ్యేయం కాదు, కాకూడదు. శతకోటి జీవరాశుల్లో ఉత్తమమైనది. మానవజన్మకాబట్టే, జ్ఞానమనేది మానవునికి ప్రసాదింపబడిన భగవద్దత్తమైన వరం. తరం తరం నిరంతరం జ్ఞానంతో మనిషి బ్రతకడం అవసరం. మనుష్యుల్లో కొట్లాటలూ, ప్రజా స్వామ్యంలో అధికమవుతాయని భావించిన భగవంతుడు, ముందు దృష్టితో (దూరదృష్టితో) చాతుర్వర్గాలను సృష్టించాడు. చాతుర్వర్ణం మయాదత్తం అంటూ 'చాతుర్వర్ణం మయా సృష్టం గుణకర్మ విభాగశః – తస్య కర్తారమపి మాం విద్యకర్తారమ వ్యయం' అని వారి వారిని, గుణకర్మల ప్రకారం విభాగించారు. ఒకరి కర్మల్లో మరొకర్ని చొరబడనీయకుండా, పోటీలకు దిగ కుండా, ఎవరి వృత్తుల్ని వారు చేస్తూ, సమష్టి కార్యకలాపా లొచ్చినపుడు కలిసికట్టుగా పనిచేసే నీతియుక్త ధర్మంలో నిమగ్నులయ్యేట్టు చేశారు. ఒకరి కష్టసుఖాల్లో మరొకరు, ఒకరి శుభాశుభ కార్యకలాపాల్లో మరొకరు, పాల్గొనేట్టుగా గ్రామ (రామ) రాజ్యాల్ని తీర్చిదిద్దారు. ఇది భగవంతుని దూరదృష్టికి నిదర్శనం.

'సమానత' అనే నినాదం ఎప్పుడూ తలెత్తలేదు సరికదా 'సహాయకత', 'సౌభ్రాతత' అను ధర్మమే విద్యుక్తధర్మంగా నెలకొన్నది. పూర్వపు ప్రజల్లో 'కులాల'ను కప్పిపుచ్చే విధంగానే నామధేయాలుండేవి. ఆరాధనాలయాలు కూడా అతి కొద్దిగానే ఉండేవి. ఆలయాల ప్రక్కనే మసీదులూ, మసీదులు ప్రక్కనే చర్చిలూ, పోటీలుపడి నిర్మించేవారు కారు. ఒకరి ప్రార్థనాలయా లను మరొకరు గౌరవించేవారు. హిందూ, ముస్లిమ్, క్రైస్తవ, శిఖు, జైన్, పార్శీ సోదరులు 'వారు' ఫలానాయని చెప్పుకుంటే తప్ప, వారి 'ఉనికి' తెలిసేది కాదు. అందరూ భారతీయులుగానే ఉండేవారు. అలాటి సమాజం, గ్రామవ్యవస్థ, సహజ వనరుల రీత్యా యేర్పడిన వ్యవసాయకఫలం నశించింది. ఈ నూతన సహస్రాబ్ది శతాబ్దిలోనైనా గ్రామాలు సకల వనరుబిరి, వసతి సంపదలతో వర్ధిల్లుతూ, జనంతో కలకలలాడుతూ, నగర పట్టణాల జనసమృద్ధీ, పారిశ్రామిక కాలుష్యమూ, రాజకీయ పార్టీల కాలుష్యమూ తగ్గుముఖం పడితేనే 'భారతదేశం' పూర్వపు ఔన్నత్యాన్ని పొందకలుగుతుంది. భారత ప్రజలు అలజడులు లేని జీవితాన్ని సాధించకలుగుతారు. అలాటి స్వర్ణయుగం, స్వర్ణమయ జీవితం యీ నూతన శతాబ్దంలో పొంద కలుగుతా మనీ ఆశిస్తున్నాను. మతంలోనూ, మతకార్య కలాపాల్లోనూ 'రాజకీయ ప్రవేశం' ఉండడం మంచిది కాదని సలహా యిస్తున్నాను.



**జై భారత్, జై ఆంధ్ర**

బుధజన విధేయుడు

***– గోటేటి శ్రీరామారావు***

(ఫిబ్రవరి 2000)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# శంకరాభరణం (ఈమని) శంకర శాస్త్రి

ఈమని శంకర శాస్త్రి గారు 23, సెప్టెంబర్, 1922లో తూర్పు గోదావరి జిల్లా లోని ద్రాక్షారామంలో శాస్త్రీయ సంగీత విద్వాంసుల కుటుంబంలో జన్మించారు. వీరి తండ్రిగారు వైణిక భూషణ వీణాచార్య ఈమని అచ్యుత రామ శాస్త్రి గారు. వీరు సుప్రసిద్ధులైన వైణిక విద్వాంసులైన శ్రీయుతులు తుమరాడ సంగమేశ్వర శాస్త్రి (1874–1932), వెంకట రమణ దాసుల (1866–1948) సమకాలీకులు. ఈ వీణ వింద్వాంసులందరూ ఆ రోజుల్లో వీణని చేతుల్లో నిలువుగా పట్టుకుని వాయించేవారు. శంకర శాస్త్రి తన మూడవ ఏటి నుంచే వీణ వాయిద్యం పైన ఆసక్తి కనబరచి తన తండ్రి అచ్యుత రామశాస్త్రి, పితామహులు సుబ్బయ్య శాస్త్రి వద్ద మెళకువలు నేర్చుకున్నారు. బాల్యం లోనే కర్ణాటక సంగీతంతో పాటు హిందుస్తానీ, పాశ్చ్యాత్య సంగీతపు బాణీలను కూడా నేర్చుకోవటంతో తరువాతి కాలంలో వీరి బాణీ త్రివేణీ సంగమంలా కొత్త ఒరవడిని సృష్టించింది. ఈమని శంకర శాస్త్రి తన తొలి వీణ కచేరీని 1940లో తిరుచ్చి ఆకాశవాణి కేంద్రంలో ఇవ్వగా దానికి మంచి ఆదరణ లభించింది. పిఠాపురం మహారాజా కళాశాల, కాకినాడ (ఆంధ్ర విశ్వవిద్యాలయము) లో చదువుని ముగించి 1942లో మద్రాసు లోని జెమినీ స్టూడియోలో చేరిన ఈమని శంకర శాస్త్రి ఒక దశాబ్దం పైన సంగీత దర్శకత్వపు విభాగంలో పనిచేసి చాలాకాలం సాలూరి రాజేశ్వర రావు గారికి సంగీత దర్శకత్వంలో సహకారం చేశారు. మంగ్ల, సంసార్, బహుత్ దిన్ హుయే, వింధ్యారాణి, నిషాన్, మిస్టర్. సంపత్ వంటి హిట్ చిత్రాలకి, చంద్రలేఖ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ల సంగీతానికి ఈమని వారి హస్తం వుంది. ఏ.ఎం.రాజా, పి.బి.శ్రీనివాస్ వంటి నేపథ్య గాయకుల గళాలు ఈమని వారి సంగీతంలో విప్పారాయి. ఈమని 1959లో మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో మ్యూజిక్ ప్రొడ్యూసర్‌గా చేరారు.

అనతి కాలంలోనే డైరెక్టర్ స్థాయికి ఎదిగి జాతీయ సంగీత వాద్యబృందానికి చీఫ్ ప్రొడ్యూసర్ ఆఫ్ మ్యూజిక్‌గా ఢిల్లీలో సేవలు అందించి దేశవ్యాప్తంగా శ్రోతల ఆదరాభిమానాలని చూరగొన్నారు. హిందుస్తానీ విద్వాంసులతో కలిసి జుగల్బందీలు చేసిన తొలి తరానికి చెందిన కర్ణాటక విద్వాంసులలో పేరెన్నిక కలవారు ఈమని. వీరు ఉస్తాద్ అబ్దుల్ హలీమ్ జాఫర్ ఖాన్, పండిట్ రవి శంకర్ (సితార్), పండిట్ గోపాల్ క్రిషన్ శర్మ (విచిత్ర వీణ) లతో కలిసి చేసిన జుగల్బందీలకి దేశవ్యాప్తంగా అభిమానుల ఆదరణ లభించింది.

## ఈమని వారి ప్రయోగాల్లో కొన్ని మచ్చు తునకలు

1. ఆదర్శ శిఖరారోహణం – టెన్సింగ్ నార్గే 1953లో ఎవరెస్టు అధిరోహణం చేసిన అంశం ఆధారంగా ఈమని చేసిన సంగీత ప్రయోగంలో ఆయన ఆరు వీణలని ఉపయోగించారు. సృజనాత్మక సంగీతాన్ని ఆస్వాదించే రసికులకి ఇది ఒక అద్భుత సంగీత సృష్టిగా చరిత్రకి ఎక్కింది.
2. స్వర తరంగిణి– ఈ వాద్య బృందపు మేళనంలో ఈమని వారు వివిధ శబ్ద తరంగాలని తమ సంగీత ప్రయోగంలో పలికించి వాటిని సప్తస్వరాలతో అనుసంధించి తద్వారా శబ్దమూలానికి, నాదానికి, సంగీతానికి గల సంబంధాన్ని, ప్రాముఖ్యాన్ని సంగీత ప్రియులకి తెలియచెప్పే ప్రయత్నం చేశారు.
3. రాగం తానం పల్లవి – ఈ వాద్య బృంద సమ్మేళనం తోడి రాగం మీద ఈమని వారు చేశారు. దీనికి అశేష సంగీత భిమానుల, విమర్శకుల ప్రశంశలు లభించాయి.
4. ఇందు – ఈ ప్రయోగంలో ఈమని వారు మేళకర్త రాగాలలో ఆరు రాగాలని వాడారు. (మేళకర్త రాగాలు 72. వీటిని 17 వ శతాబ్దంలో వెంకటేశ్వర దీక్షితులు సంస్కృతంలో రచించిన "చతుర్దండి ప్రకాశిక" అనే గ్రంధములో పొందుపరచారు. ఈ మేళకర్త రాగాలు కర్ణాటక సంగీతానికి మూలాధారం.)
5. భ్రమర విన్యాసం– ఈ వినూత్న ప్రయోగంలో భ్రమరం (తుమ్మెద) యొక్క దినచర్యని వివరిస్తూ ఈమని వారు చేసిన వాద్య సంగీత సమ్మేళనానికి ప్రిక్స్ ఇటాలియా (అంతర్జాతీయ ఇటాలియన్ టెలివిషన్, రేడియో బ్రాడ్కాస్టింగ్ వెబ్సైట్ అవార్డు) పురస్కారం లభించింది.

విశ్వ విఖ్యాత వాయులీన విద్వాంసుడు యెహూది మెనుహిన్ యొక్క ప్రత్యేక ఆహ్వానంతో ఈమని 8, జనవరి, 1974 న పారిస్‌లో అంతర్జాతీయ సంగీత ఉత్సవంలో పాల్గొని ప్రశంశలు పొందారు.

ఈమని శంకర శాస్త్రిని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసులుగా గౌరవించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, మద్రాస్ సంగీత అకాడమీ నిపుణుల కమిటీలో వీరు సభ్యులుగా సేవలు అందించారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం వారిచేత మహామహోపాధ్యాయ బిరుదుని అందుకున్న తొలి దక్షిణాది సంగీత విద్వాంసులు ఈమనివారు. వీరు 1973లో సంగీత నాటక అకాడెమీ అవార్డు, సాహిత్య కళా పరిషత్ అవార్డు, 1974లో భారత ప్రభుత్వం వారిచే పద్మశ్రీ మరియు ఆంధ్రా విశ్వవిద్యాలయం వారిచే గౌరవ డాక్టరేట్ పొందారు. ఇవికాక మరెన్నో అసంఖ్యాకమైన బిరుదులు, సన్మానాలు, సత్కారాలు ఈమనివారిని వరించాయి. సోవియెట్ యూనియన్ వారి ప్రతిష్ఠాత్మక ఆసియన్ రోస్ట్రం అవార్డు 1973 లో శంకరాభరణ రాగంలో ఈమని వారు వీణ మీద వాయించిన కృతికి లభించింది. అప్పటినుంచి వీరిని సంగీతాభిమానులు శంకరాభరణం శంకర శాస్త్రిగా పిలిచేవారు. గురువుగా చిట్టిబాబు, పాలగుమ్మి విశ్వనాధం, ఈమని కళ్యాణి లక్ష్మీనారాయణ (ఈమని వారి కుమార్తె) వంటి శిష్య రత్నాలని ఈమని వారు సంగీత ప్రపంచానికి అందించారు. పండిట్ నెహ్రూ ఈమని వారిని "మన దేశ కళలకు ప్రతినిధి" గా కొనియాడారు.

లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాన మంత్రి గా వున్నప్పుడు వారి ఇంట్లో ఈమని వారు వీణ కచేరీ చేసినపుడు గౌరవ సూచకంగా లాల్ బహదూర్ శాస్త్రి నేల మీద కూర్చుని ఈమని వారి సంగీతాన్ని ఆస్వాదించారు. కచేరీ చివర్న ప్రధానమంత్రి హోదాలో ఘనంగా ఈమని వారిని సన్మానించి వ్యక్తిగతంగా తనవంతు సన్మానంగా ఒక మామూలు కాటన్ శాలువాతో లాల్ బహదూర్ శాస్త్రి ఈమని వారిని సత్కరించారు. మరొక సందర్భంలో శృంగేరీ పీఠాధిపతి ఈమని వారిని బంగారు శాలువాతో సత్కరించారు. తదనంతరం ఈమని వారు కచేరీలకి వెళ్ళినపుడు వీణకి ఈ రెండు శాలువాలని కప్పి తీసుకుని వెళ్లేవారు.

కాంటాక్ట్ మైక్రోఫోన్ ఉపయోగించిన తొలితరం కర్ణాటక సంగీత వాయిద్యకారులలో ఈమని వారు ఒకరు. దానివలన ఈమని వారు అలవోకగా అత్యంత వేగంగా కీర్తనలు వాయించినప్పుడు కూడా వీణా నాదానికి ఉచ్ఛారణతో పాటు శబ్దంలో కూడా స్పష్టత పరిపూర్ణంగా శ్రోతలకు వీనులవిందు చేసేవి.

కర్ణాటక సంగీతంలో వీణకి స్వర మాధుర్యానికి నాలుగు తీగలు, తాళానికి మూడు తీగలు వెరసి ఏడు తీగలు వున్నాయి. ఈమని వారు తన వీణకి ఈ ఏడు

# ప్రతికూల పరిస్థితినైనా అధిగమించాలి

సానుకూల పరిస్థితి కాదా... అయినాసరే ఆ పరిస్థితిని అధిగమించడానికి పాజిటివ్‌గా ఆలోచించాలి అన్నాడు ప్రముఖ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు మైఖేల్ జోర్డాన్.

చాలాసార్లు మన నీరసానికి అలసటకు మానసిక ఆందోళనకు వాటివల్ల వచ్చే ఓటములకు కారణమేమిటాని ఆలోచిస్తే మనలోని నెగటివ్ ఆలోచనలే అని అర్థమవుతుంది. పాజిటివ్ ఆలోచనకే బలమెక్కువ. మంచినే అనుకుందాం.... మంచే జరుగుతుంది అనే మాటలు వొట్టి మాటలు కావు. ప్రతి ఒక్కరు అనుసరించాల్సిన మాటలవి. మంత్రంలాంటి శక్తిమంతమైన మాటలు.

ఆయన ఇంగ్లండుకి చెందిన ఓ రచయిత. అది అర్ధరాత్రి దాటింది. ఏప్రిల్ నెల ప్రారంభమైన సమయం. గత ఏడాదిలో ఏప్రిల్ మొదలుకుని మార్చి వరకు తనకు ఏంటేటి జరిగాయో ఆలోచించారు. తలిచే కొద్దీ కన్నీళ్ళు పొంగుకొస్తున్నాయి. టేబుల్ ముందర కూర్చున్నారు. పేపరూ పెన్నూ తీసుకున్నారు. అవన్నీ రాయడం మొదలుపెట్టారు.

నాకొక ఆపరేషన్ జరిగింది. ఈ ఆపరేషన్లో ఓ అవయవాన్ని తొలగించారు. ఆపరేషన్ కారణంగా మంచం దిగలేకపోయాను. నాకు అరవై ఏళ్ళు పూర్తయ్యాయి. నాకిష్టమైన పని నా వృద్ధాప్యం కారణంగా నాకు దూరమైపోయింది. సుమారు ముప్ఫై ఏళ్ళు పని చేసిన పబ్లిషింగ్ సంస్థ నుంచి బయటికొచ్చేశాను. అదే ఏడాది అదే సమయంలోనే నా ప్రియమైన తండ్రి మరణించడంతో శోకం మిగిలింది. నా కొడుకుకి ఓ ప్రమాదం జరిగింది గత ఏడాదిలోనే. ఈ కారణంగా వాడు వైద్య విద్య పరీక్షలో తప్పాడు. కాళ్ళకు గాయమవడంతో కదల్చలేక పలు వారాలు మంచానికే పరిమితమయ్యాడు. ప్రమాదంలో వాడికి గాయపడటంతోపాటు నా కారూ ధ్వంసమైంది. ఇవన్నీ రాసి చివరగా ఆ రచయిత ఇలా రాసారు....

దేవుడా! ఇది చాలా దారుణమైన ఏడాది అని.

రచయిత భార్య ఆ గది తలుపు దగ్గర నిల్చుని లోపలికి తొంగి చూసింది. భర్త శోకంతో కన్పించాడు. ఏదో ఆలోచిస్తున్నాడని ఆమె గ్రహించింది. ఆయన ఏదో రాయడమూ కనిపించింది. ఆమె చప్పుడు రానివ్వక మెల్లగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

కాస్సేపటికి ఆయన పడుకుండిపోయారు. అనంతరం ఆమె నెమ్మదిగా ఆ గదిలోకి ప్రవేశించింది. భర్త రాసిన విషయాలను చదివింది.

ఒక్క క్షణం ఆలోచించింది.

ఆమె మరొక పేపర్ తీసుకుని కొన్ని విషయాలు రాసింది. తన భర్త రాసుకున్న కాగితాలను తీసేసి తను రాసిన కాగితాన్ని అక్కడ ఉంచి బయటకు వచ్చేసింది.

మరుసటిరోజు ఆ రచయిత లేచి ఆ గదిలోకి వెళ్ళారు. బల్ల మీద తను రాసిన కాగితాలు కనిపించలేదు. తన భార్య రాసిన కాగితం కనిపించింది. అందులో ఇలా రాసి ఉంది....

పలు సంవత్సరాలుగా నాకు ఎంతో కష్టం కలిగించిన ఓ అవయవాన్ని తొలిగించడంతో ఆ బాధ నుంచి బయటపడ్డాను.

నా అరవయ్యో ఏట మంచి ఆరోగ్యంతో నా ఉద్యోగంలోంచి పదవీ విరమణ పొందాను.

ఇక నా సమయాన్ని ప్రశాంతంగా గడుపుతాను. ఇక ఏ అడ్డంకులు లేకుండా నేననుకున్నది రాసుకోవడానికి నాకిప్పుడు బోలెడంత టైమ్ దొరికింది.

మా నాన్న తొంభై అయిదేళ్ళ వరకూ ఎవరిమీదా ఆధారపడకుండా ఎవరితోనూ పనులు చేయించుకోకుండా అద్భుతమైన జీవితాన్ని గడిపారు. ఆయన మహామనీషి. ఏ సమస్యా లేకుండా కాలధర్మం చెందారు.

గత ఏడాదే దేవుడు నా కొడుకుకి కొత్తగా ఓ జీవితాన్నిచ్చాడు.

నా కారు ధ్వంసమైంది. పోతేపోయింది. నా కొడుకు పెనుప్రమాదం జరగక కాలు గాయంతో బయటపడ్డాడు. అది చాలు.

ఈ మాటలన్నీ రాసి చివరగా ఆ దేవుడి కృపవల్లే ఈ ఏడాదంతా మంచిగా జరిగింది. నీకు కృతజ్ఞతలు దేవుడా!

మంచినే ఆశిద్దాం.

మంచే జరగనీ!

– యామిజాల జగదీశ్




---

తీగలే కాకుండా మరో రెండు తీగలు (తాళ తంత్రులు) బిగించేవారు. దానితో వీరి వీణా వాయిద్యంలో శ్రోతలకు తాము ఒక వాయిద్య సమ్మేళనం వింటున్న అనుభూతి కలిగేది. వీణ మీద చెక్క తో చెయ్యబడిన భాగంపైన ఈమని వారు మృదంగ శబ్దాలని తమ కచేరీలలో పలికించి శ్రోతలకు జాజ్ సంగీతంలా అనుభూతిని కలుగచేసేవారు. అదేవిధంగా వీణపైన గిటార్ శబ్దాలనికూడా వీరు పలికించేవారు. దీనితో వీరి కచేరీలకి శ్రోతలు అత్యధిక సంఖ్యలో వచ్చేవారు. ఈమనివారి వీణ కచేరీలకి ప్రముఖ వయోలిన్ విద్వాంసులైన శ్రీయుతులు లాల్గుడి జయరామన్, ఎం.ఎస్.గోపాలకృష్ణన్‌లు వాయిద్య సహకారం అందించేవారు. ఈమని వారు వీణపైన తాను రచించి స్వరపరచిన కీర్తనలు, జావళులు, భజనలు వాయించేవారు. కొన్ని సందర్భాలలో వీణపైన భజనలు వాయించేటప్పుడు వీరు గానం కూడా చేసేవారు.

1980 దశకంలో శ్రీ రామనవమి ఉత్సవాల సందర్భంగా మద్రాసు లోని పాత మాంబళంలోని అయోధ్యా మంటపం లో ఏర్పాటయిన ఈమని వారి వీణ కచేరీలో కచేరి ప్రారంభం అయిన కొంత సేపటికి ఈమని వారు కేవలం వీణ వాయించటమే కాకుండా తమ వీణ పైన మృదంగం కూడా వాయించి స్వయంగా పాడుతూ ప్రేక్షకులని మంత్రముగ్ధుల్ని చేశారు. మృదంగం, ఘటం వాయిద్యకారులు వేదికమీద తాముకూడా ప్రేక్షకులుగా, శ్రోతలుగా ఈమని వారి అద్భుత వీణా నాదంలో అపర రుద్రుడిని తిలకించారు. ఆ నాటి అసంఖ్యాక ప్రేక్షకులలో ఈ వ్యాస రచయిత కూడా ఒకడు!

ఆకాశవాణి సంగీత కార్యక్రమాలలో ఈమని వారు సృజనాత్మక తో విన్నూత ప్రయోగాలు ఎన్నో చేసినా, బయట సంగీతాభిమానుల ముందు చేసే వీణ కచేరీలలో మాత్రం చాలామటుకు సంప్రదాయ బద్ధంగా కర్ణాటక సంగీతానికే ప్రాధాన్యత ఇచ్చేవారు.

దీనితో ఈమని వారు అటు సంగీతాభిమానుల, ఇటు సంగీత విమర్శకుల మన్ననలు పొందగలిగారు. ఆకాశవాణి నుంచి పదవీ విరమణ చేసిన తరవాత కూడా స్వరకర్తగా కొనసాగారు. 23, డిసెంబర్, 1987 న గుంటూరులో కచేరీ ముగించి మద్రాసుకి ట్రైన్‌లో వెడుతుండగా శివసాయుజ్జం పొందారు.

ద్రాక్షారామంలో శివుడు భీమేశ్వరుడిగా, పార్వతీ దేవి మాణిక్యాంబగా (అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి) భక్తులచే పూజింపబడుతున్నారు. పురాణాలలో శివుడు సంగీతానికి, నాట్యానికి ఆది గురువుగా కీర్తింపబడుతున్నాడు. శివుడి వీణ పినాకి, అందుకే శివుడిని పినాకపాణి అని కూడా పిలుస్తారు. ద్రాక్షారామంలో జన్మించిన ఈమని శంకర శాస్త్రి వీణని జగద్విఖ్యాతి చేసి, కర్ణాటక సంగీత కచేరీలలో కేవలం పక్క వాద్యంగా పరిమితమయిన వీణని, కచేరీలలో ప్రధానమయిన వాద్యంగా ఉన్నత స్థాయిలో నిలబెట్టారనటంలో సందేహం లేదు. భారతీయ శాస్త్రీయ సంగీతపు చరిత్ర పుటల్లో విశిష్టమైన కళకారునిగా ఈమని వారి పేరు చిరస్థాయిగా నిలిచి పోతుంది.

– డాక్టర్. బీ. యన్. వీ. పార్ధసారథి

# బాలమురళి



'నేను సంగీతరంగంలో ఏ కొంచెమైనా సాధించగలిగాను అంటే... నా చిన్నతనం నుండీ ఎందరో మహానుభావులు నా గానం విని, నాకందించిన ఆశీస్సుల వల్లనే..' అనేవారు మంగళంపల్లి బాల మురళీకృష్ణగారు.

మురళీగారు మరచిపోలేని ఒక మధుర ఘటన 30-1-1940న జరిగింది.

అది బందరు పట్టణం...

అనాదిగా సంగీత, సాహిత్యాది విద్యలలో ఎందరో ఉద్దండులకు బందరు ఆయువుపట్టు... త్యాగరాజస్వామి ప్రశిష్యులైన సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులవారు చరించిన నేల... 'వాగ్గేయకారరత్న' హరి నాగభూషణం గారు వసించిన తావు...

బెజవాడలో బాలమురళి గానాన్ని అప్పటికే వినియున్న కుర్తాళం పీఠాధిపతులైన శ్రీ శ్రీ శ్రీ విమలానందభారతీ స్వామివారి ఆమేరకు, బందరులో బాలమురళి గాత్ర కచేరీని "గానవిద్యాభివర్ధని" సభవారు స్థానిక బుట్టాయపేట టౌనుహాలులో ఏర్పాటుచేశారు.

హాలు శ్రోతలతో నిండిపోయింది. ఆ పట్టణ ప్రముఖులైన హరి నాగభూషణం గారు, దాసు గోవిందరావు పంతులుగారు, దాలిపర్తి పిచ్చహరిగారు,కుర్తాళం పీఠాధిపతులు మొదలైన పెద్దలు సభలో ఆసీనులయ్యారు.

హరి నాగభూషణంగారు వృత్తిరీత్యా వకీలు అయినప్పటికీ, పరమ నైష్ఠికులు, సంస్కృతాంధ్ర భాషలలోనూ, సంగీతంలోనూ సాటిలేని పండితులు, జంత్రగాత్ర విద్వాంసులు, స్వయంగా వాగ్గేయకారులు.

అటువంటి పెద్దలు ముందు వరుసలో పరివేష్ఠించి ఉండి, పదేళ్ల బాలుడు ఏమి పాడుతాడో చూద్దామని ఎదురుచూడటం విశేషమే!



వేదికపై మురళిగారి వెనుక కూర్చున్న తండ్రి పట్టాభిరామయ్య గారు, ఆతని చెవిలో, 'సభలో హరి నాగభూషణంగారు ఉన్నారు. వారిని మెప్పించటం ఎవరివల్లా కాదు. జాగ్రత్తగా పాడు' అని హెచ్చరించారు.

కానీ ఆ హెచ్చరికలు మురళికి ఏమి అవసరం? కేవల భగవదావేశ ప్రేరితుడై, పూర్వజన్మ సుకృతంతో ప్ర ప్రాటవాలను పుట్టుకతోనే పుణికిపుచ్చుకొన్న వాడాయె! సాక్షాత్తూ నాగభూషణుడే వెండి కొండ దిగివచ్చినా, ఆతని పాటకు కరగిపోవలసిందే...

కచేరీ ఆరంభమైంది. వర్ణంతోనే శ్రోతల మనస్సులను ఆకట్టుకున్న ఆ గంధర్వగానం, క్రమంగా ఉప్పొంగిన కడలితరంగమై, ఉవ్వెత్తున ఎగసిపడసాగింది...

అయితే... మధ్యలో చివాలున లేచి, హరి నాగభూషణం గారు సభనుండి చరాచరా బయ టకు వెళ్లిపోయారు.

'అనుకున్నంతా జరిగింది. నాగభూషణంగారికి మురళీ సంగీ తం నచ్చలేదు. ఎక్కడ లోపం జరిగిందో ఏమో!' అనుకున్నారు పట్టాభిరామయ్య గారితోపాటు అక్కడివారంతా.

కానీ ఇదేదీ పట్టించుకోకుండా బాలమురళి, తన గానంలో మునిగిపోయాడు. ఒక ఇరవై నిమిషాల తరువాత నాగభూషణంగారు తిరిగివచ్చారు. వారి వెనుక, వారి కుటుంబసభ్యులంతా వచ్చారు.

వారి ఇల్లు దగ్గరే కావటంతో వారందరికీ మురళీగానం వినిపించటం కొరకు ఆయన వెళ్లారు! అది అందరికీ అర్థమై, తేలికగా ఉపిరి పీల్చుకున్నారు!

నాగభూషణంగారు, వారి కుటుంబ సభ్యులు స్థిమితంగా కూర్చొని, కచేరీ ఆసాంతం ఆస్వాదించారు.

మంగళప్రదంగా కచేరీ ముగిసింది. నాగభూషణంగారు వేదిక వద్దకు వెళ్ళి, బాలమురళిని ఎత్తుకొని, వాత్సల్యంతో తలనిమిరి, తనకు బహూకరించబడిన ఒక బంగారు పతకాన్ని ఆతని జుబ్బాకు తగిలించారు. నిర్వాహకుల కోర్కెమేరకు ఆశీర్వాదపూర్వకంగా కొద్దిసేపు ప్రసంగించారు. కుర్తాళం పీఠాధిపతులు కూడా సభ పక్షాన, ఒక బంగారు పతకాన్ని మురళికి బహూకరించి, తమ పరిపూర్ణమైన దీవెనలను అందించారు.

హరి నాగభూషణంగారి కుమారులైన శంకరశాస్త్రిగారి శిష్యుడు, అల్లుడైన సంగీత విద్వాన్ పోపూరి గౌరీనాథ్ గారు బాలమురళిగారిని బెజవాడలో తమ 'సద్గురు సంగీత సభ'లో సత్కరించినపుడు మురళీగారు, పై సంఘటనను గుర్తుచేసుకుంటూ... 'ఆలాపన చేసే సమయంలో ఒకస్వరంలో దీర్ఘంగా నిలిపినపుడు 'రి' అంటూ పాడే సంప్రదాయం ఒకప్పుడు ఉండేది. అయితే, నేను దాన్ని 'హరి' అని మార్చుకున్నాను. అలా పాడే సమయంలో హరి నాగభూషణంగారు నా మదిలో నిలుస్తారు' అంటూ పెద్దలఎడ తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు.

P.S: (పూర్వపు గాయకులు 'రి' అంటూ నిలపడం వెనుక ఒక రహస్యం ఉంది. ఇకారంలో కుదిరిన శ్రుతిశుద్ధత, ఆకారంలో కుదరదు. అందుచేత,రాగాలాపన చేసే గాయకులు ఒక స్వరంలో ఎక్కువసేపు నిలిపేటప్పుడు 'రి' అనేవారు. అయితే, మురళీగారు, 'రి' బదులు, భగవన్నామం 'హరి' అంటే పుణ్యం, పురుషార్థం కలసివస్తాయని అలా 'హరినామం' చేయటం ఆరంభించారు.)

**- మోదుమూడి సుధాకర్**

# కంచికి చేరని శ్రీవిరించి కథ

సుప్రసిద్ధ కథకులు, రాజనీతి శాస్త్ర కోవిదులు, కలం పేరుతో శ్రీ విరించిగా చిరపరిచితమైన శ్రీయుతులు కీ॥శే॥ డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రామానుజాచారి గారి గురించి, వారి ఔన్నత్యం గురించి, వారి సాహితీ సేవ గురించి కొత్త తరానికి తెలియజేయడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

కథా రచనలో ఒక కొత్త ఒరవడి సృష్టించి అనేక కథలు రాసి మెప్పించిన సమాజ పరిశీలకులు శ్రీవిరించి. వీరి కథలలో సమాజంలోని పేద, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి పాత్రలే అధికంగా దర్శనమిస్తాయి. ఆయా తరగతుల దైన్యత దృశ్యంగా మెదులుతుంది. వారి కథనం గురించి చెప్పాలంటే ఒక చక్కని పరిశోధనాంశం. వీరి కథా శైలికి ఒక ప్రత్యేక గుణముంది. కథా శీర్షిక ఎంపికలోనే వీరి రచనా శైలిలోని ప్రత్యేకత ద్యోతకమవుతుంది. వాస్తవానికి వీరి అనేక కథా శీర్షికలకు సదరు కథకు పొంతన చాలా మటుకు కనిపించదు. చివరి వాక్యంలోనో లేదా చివరి పేరాలోనో ఆ శీర్షిక తాలూకు వివరం చెబుతారు శ్రీవిరించి. ఇక కథనం అమోఘమనే చెప్పాలి. పాఠకుని నరం తెలిసిన కలం మాంత్రికులు శ్రీవిరించి అని చెప్పవచ్చు. కథలో చెప్పాలనుకున్న విషయం చిన్నదైనా, పెద్దదైనా, చెప్పే రీతిలో మాత్రం సస్పెన్స్ వీలైనంత ఉంటుంది వీరి కథనంలో! 'తరువాత ఏం జరగబోతోందో' పాఠకుని మదికి చివరి దాకా అందకుండా జాగ్రత్తపడతారు శ్రీవిరించి. చివరి వరకూ కొనసాగిన సస్పెన్స్‌లో పరిగెత్తిన పాఠకుడు 'ఓహో ఇదా అసలు విషయం' అని కొద్దిసేపు ఆ కథా మత్తులోంచి బయటికిరారని కచ్చితంగా చెప్పవచ్చు. శిల్ప నిర్మాణం కూడా సహజ కథలకు భిన్నంగా, అలతి పదాలతో చిన్న చిన్న వాక్యాల నిర్మాణంతో, మనిషి తనకి తాను వేసుకునే అనేక ప్రశ్నలతో పాఠకుడి మదిలోని భావాలను అక్షరాల్లో ఒంపేస్తారు శ్రీవిరించి. ఇక అధికంగా వీరి కథలు విషాదంతో ముగుస్తాయి. కానీ ఒక సానుకూల వైఖరిని ఆ పాత్రల భావాల్లో చూపించేందుకు చివర వాక్యంలో ధైర్యం నూరి పోస్తారు శ్రీవిరించి. అది వీరి అనేక కథల్లో స్పష్టంగా గోచరిస్తుంది. వీరి జన్మస్థలం విజయవాడ కావడంతో విజయవాడపై ఉన్న మమకారాన్ని వీరు చాలా కథల్లో చూపిస్తారు. వీరి కథలు, కథా వస్తువు, కథా శైలి, వంటి వాటి గురించి చర్చించాలనుకున్నప్పుడు కొన్ని కథల గురించి ప్రస్తావించాలి.



మొదటగా 1954 ఏప్రిల్ 23 న తెలుగు స్వతంత్రలో ప్రచురితమైన కథ "పంకజం తెచ్చిన పంకిలం." ఒక మహిళ చేతిలో చిక్కి అన్నీ పోగొట్టుకుని నడిరోడ్డున ఒంటరిగా మిగిలిన దీనుడి గాథ ఇది. ఇలాంటి వారు మనకి చాలా మంది తారసపడుతూనే ఉంటారు. ఈ కథలో నాయకుడి స్వీయ అనుభవం ఉంటుంది. ఈ కథ ఒక ఏక పాత్ర నాటికని తలపిస్తుంది. కథ ప్రారంభంలోనే ప్రశ్నల వరద. ఇక కథా శీర్షికలోని 'పంకజం అనే పాత్రని సగం తర్వాత పరిచయం చేస్తారు కథకులు. అనేక ప్రశ్నల ఒరవడితో కొంచెం కొంచెం క్లూ ఇస్తూ వీరి కథ సస్పెన్స్ గా కొనసాగుతుంది. అవన్నీ జవాబు దొరకని ప్రశ్నలని కథానాయకుడే అనేస్తాడు. జీవితమే ఓ ప్రశ్న అని వేదాంతం ప్రవచిస్తాడు.

విషాదాంతం చేసిన ప్రతి కథకూ ఒక ఆశావహ గీతని గీస్తారని చెప్పుకున్నట్లుగానే, శ్రీవిరించి ఈ కథ ఆఖరులో "ఇప్పుడు ఎవరూ ఎవరికీ ఏమీ కారు. తను మాత్రం బాధలు భరిస్తాడు- భయాలు వెనక్కినెడతాడు: అట్లానే నించుంటాడు. నించున్నంత కాలం చూస్తుంటాడు" అని కథకి ఫుల్ స్టాప్ పెడతారు. కథకులైన శ్రీవిరించి గారికి స్త్రీ పట్ల ఉన్న అపారమైన గౌరవం ఈ కథలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇంత కథలోనూ ఎక్కడా పంకజం గురించి కథకులు అదనంగా వ్యాఖ్య చేయరు. ఎక్కడా ఆమె వృత్తిని దూషించరు. ఆమె వృత్తి ఫలానా అని కూడా ఆయన చెప్పరు. అది వారి గొప్పదనం.

ఇక శ్రీవిరించి గారి మరో ఆణిముత్యం 'అసహాయుని హాహాకారం'. ఇది కథ కాదు. అపురూపకం అంటారు. ఇది కూడా తెలుగు స్వతంత్రలో 1951 జూన్ ఒకటిన ప్రచురితమైంది. ఈ రూపకంలో సమాజంలో మనుషుల మానసిక స్థితిని ముఖ్యంగా దారిన పోయే దానయ్యలని ఎద్దేవా చేస్తారు శ్రీ విరించి. కథానాయకుడు శ్రీనివాసరావు అన్నీ తెలిసిన ఓ జ్ఞాని, రోడ్ పైనే కథనం సాగుతుంది. అతను ఎవరు అనేది సస్పెన్స్‌లో భాగం. కథానాయకుడు శ్రీనివాసరావు తనలో తాను సంభాషించుకుంటూ, ప్రపంచాన్ని దూషిస్తుంటాడు. ఆతనికి రకరకాల వ్యక్తులు తారసపడుతుంటారు.

చివరకు మరో దానయ్య "ఏమోయ్ నేనేమైనా నీకు సహాయం చేయగలనా" అంటాడు. అతడిని " ఓ రూపాయివ్వవా, పొద్దుటి నుంచి ఏమీ తినలేదని" తన అసహాయతను వ్యక్తం చేస్తాడు కథానాయకుడు. ఛీ...ఛీ అన్న అతడి సమాధానానికి, "ఒక్క నిముషం ప్రక్కన వాడికి సహాయంగా నిలవలేని వాడివి, నువ్వెందుకు పనికొస్తావ్.. ఈ ప్రపంచం ఎందుకూ పనికి రాదే నాబోటి వాడికి ముఖ్యంగా. ఇట్టి ప్రపంచంలో బ్రతికేం బ్రతక్కేం" అంటారు కథానాయకుడి రూపంలో కథకులు శ్రీ విరించి. అంటే ఇక్కడ ఒక బిచ్చగాడు ఆయన కథానాయకుడు అనే విషయాన్ని చివరలో స్పష్టంగా చెబుతాడు రచయిత. ఇక్కడ కూడా అంతటితో విషాదాంతమైన కథకి కూడా సానుకూల దృక్పథాన్ని రెండు పదాలలో చెబుతారు శ్రీ విరించి. "బ్రతికేం బ్రతక్కేం... "అయినా చూస్తాను."! అంటారు. అంటే బ్రతికే చూస్తాను అనే అర్థంలో ఆయన వాడారని స్పష్టమవుతుంది. అది శ్రీ విరించి గారిలో గొప్పదనం. ఈ రూపకం ఆద్యంతం ఒక నాటిక పంథాలో డైలాగ్స్‌లా రాశారు శ్రీ విరించి.

ఇక మరో కథ 'కొడుకు. ఇది ఆహ్వానం పత్రికలో 1995 జనవరి పదవ తేదీ ప్రచురించబడింది. 'ఇది ఇళ్లల్లో పాచిపని చేసుకుంటూ పిల్లాడిని పెంచుకునే ఒక సాదాసీదా సింగిల్ పేరెంట్ రాములమ్మ కథ. కొడుకు కోసం రోడ్ల వెంట వెదుక్కుంటూ తిరుగుతూ తిరుగుతూ ఒక స్కూల్ ముందు కుప్పకూలి పడిపోతుంది. ఇక్కడితో కథ విషాదాంతం... ఇక్కడ దాకా ఆమె కొడుకు దొరుకుతాడు అన్న ఆతృత పాఠకులలో కూడా కలిగిస్తారు రచయిత.. ఇక ఇక్కడ రచయిత సహజధోరణి కనిపిస్తుంది. పిల్లల కేకలతో ఆమె తేరుకుంటుంది. చుట్టూ చిన్నారులు స్కూల్ వదలడంతో సీతాకోక చిలుకల్లా పరిగెడుతూ ఆమెను దాటి వెళుతుంటారు. వాళ్లలో తన కొడుకుని చూసుకుంటాననంటూ ఆమె అక్కడ నుంచి కదులుతుంది. అంటే అంత విషాదంలో పాఠకుడిని వదిలి పెట్టడం శ్రీ విరించి వారికి బొత్తిగా గిట్టని అంశమే అనిపిస్తుంది. ఏదో ఒక ఆశతో వారు ముందుకు వెళ్ళడమే ఆయన కథల ముగింపు. "పుట్టిన రోజు", "జీవిత రహస్యం", "పుట్టింటికి వెళ్ళిన ఇందిర", బలార్షా నుంచి నాగపుర్ దాకా వంటి వీరు రచించిన అనేక కథలు ఆణిముత్యాలు. కథా రచయితలు చదవాల్సిన కథలు. ఇలా కథకు కథకు వైవిధ్యంతో కూడిన అంశాన్ని స్పృశిస్తూ నలభై దశాబ్దాలు పైగా ఎన్నో కథలను, అనువాదాలను అందించిన శ్రీవిరించి చిరంజీవి. సాహితీ జగత్తులో ధృవతార!

(కీ.శే డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రామానుజాచారి 1935లో విజయవాడలో జన్మించారు. 1958 నుంచి థియోసాఫికల్ సొసైటీలో సభ్యులుగా ఉన్నారు. తెలుగు, ఇంగ్లీష్ లో అనేక కథలు రాశారు. తెలుగులో 100, ఇంగ్లిష్ లో 50కిపైగా విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. వందలాది గ్రంథ సమీక్షలు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీకి, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాకు అనువాదకులుగా ఉన్నారు. 87 సంవత్సరాల వయ్సులో గుండెపోటుతో జనవరి 26, 2022 న చెన్నైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు శ్రీవిరించి)

**– కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్,** విజయవాడ, 9848428978





# శ్రీ రామానుజాచార్య, శ్రీ ఆదిశంకరాచార్య

మన భారతీయ సంప్రదాయంలో 'గురు' శబ్దం చాలా మహత్తరమైనది. ఆధ్యాత్మిక వేత్తల్ని గురువులుగా భావించే విలక్షణ సంస్కృతి మనది. విశిష్ట దర్శనాలతో ప్రజానీకానికి మార్గదర్శనం చేసిన శంకరాచార్యులు, రామానుజాచార్యులు ఇరువురూ వైశాఖ శుద్ధ పంచమి నాడే జన్మించడం విశేషం. శంకరుడనగానే అద్వైతం, రామానుజుడనగానే విశిష్టాద్వైతం గుర్తుకు వస్తాయి.

శంకరులు కేరళలోని కాలడి గ్రామంలో జన్మించారు. ఆర్యాంబ, శివగురువులు వీరి తల్లిదండ్రులు. రెండేళ్ల స్వల్ప వ్యవధిలోనే వేదాలను, వేదాంతసారాన్ని అధ్యయనం చేసిన కుశాగ్రబుద్ధి. గోవింద భగవత్పాదుల వద్ద సన్యాస దీక్షను స్వీకరించారు. గురువుల ఆదేశానుసారం కాశీకి వెళ్ళి శిష్యులకు ఉపదేశంచేస్తూ, పండితులతో చర్చలు సాగిస్తూ, వివిధ మతాల్లోని దోషాలను సహేతుకంగా విమర్శించేవారు. మండనమిశ్రుణ్ని, అతడి భార్య ఉభయ భారతిని శాస్త్ర చర్చల్లో ఓడించి, సత్యనిష్ఠతో జ్ఞానమార్గ వైశిష్ట్యాన్ని గుర్తింపజేశారు. సన్యాసం ఒక మానసిక పరిపక్వ స్థితి. మనుషుల మధ్య ఉంటూనే మమతానుబంధాలను అధిగమించి మానవతా ధర్మాన్ని ప్రచారం చెయ్యాలని శంకర సందేశం.

శంకరులు బోధించిన తత్వం అద్వైతం. అది ఈ దేశపు అఖండత్వాన్ని కాపాడటానికి అక్షయమైన సిద్ధాంతం. ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్వమసి, అయమాత్మా బ్రహ్మ వంటి శ్రుతి వాక్యాలు అద్వైత సిద్ధాంతానికి ప్రాతిపదికలు. నాలుగు వేదాల నుంచి ఈ నాలుగు వాక్యాలు గ్రహించి బ్రహ్మ స్వరూపాన్ని వివరించడంలో వాటిని సమన్వయించారు. శంకరాచార్యులు జ్ఞానమార్గానికి అత్యంత ప్రాముఖ్యం ఇచ్చారు.

ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మ సూత్రాలు అనే ప్రస్థానత్రయానికి భాష్యం రాశారు. వివేక చూడామణి, శివానందలహరి, సౌందర్య లహరి, భజగోవిందం, కనకధారాస్తవం వంటి గ్రంథాల్లో వారి పాండిత్యం వెల్లడవుతుంది. సర్వజనామోదంగా ఉండేలా శివ, విష్ణు, గణపతి, సూర్య, శక్తి రూపాలతో కూడిన పంచాయతన పూజా విధానాలను ప్రవేశపెట్టారు. శంకరులు జాతీయ సమైక్యతా సూత్రాన్ని పరిరక్షించడానికి ధార్మిక జాగృతిని కలిగిస్తూ బదరి, ద్వారక, పూరి, శృంగేరిలలో నాలుగు పీఠాలు స్థాపించారు.

రామానుజులు తమిళనాడులో శ్రీపెరంబుదూరులో జన్మించారు. తల్లిదండ్రులు కాంతిమతి, కేశవాచార్యులు. యామునాచార్యుల వద్ద వైష్ణవ దీక్షను పొందారు. తిరుకోష్ఠియారు 'ద్వయ' మంత్ర రహస్యాన్ని వివరించి గోప్యంగా ఉంచమని కోరితే మోక్షం ఏ కొద్దిమందికో పరిమితం కాకూడదని తలచిన రామానుజులు ఆలయ గోపురం అధిరోహించి అక్కడ గుమిగూడిన జనులందరికీ మంత్రాన్ని బోధించారు.

పరమాత్మ ఒక్కడే. ఆయన విశిష్ట గుణసంపన్నుడు. ఆ విశేషణాలు, తత్వాలకు గల లక్షణాల్ని, వాటి మధ్య పరస్పర సంబంధాన్ని అవగాహన చేసుకునేందుకు తోడ్పడేదే జ్ఞానమని విశిష్టాద్వైతం చెబుతుంది. సూక్ష్మరూపంలో ఉండే అనేక జీవాత్మలు స్థూల రూపుడైన పరమాత్మలో అంశగా ఉంటూ పరమాత్మతో భేదాన్ని కలిగి ఉంటాయని, ఇదే విశిష్టాద్వైతమని పేర్కొన్నారు రామానుజులు. రామానుజులు సంస్కర్త. నాటి సమాజంలోని వివిధ వర్ణాలవారికి వైష్ణవంలో స్థానం కల్పించారు. భక్తిని ఉద్యమస్థాయిలో ప్రచారం చేశారు.

రామానుజులు వేదాంత సారం, వేదాంత సంగ్రహం, వేదాంత దీపం అనే గ్రంథాలు రచించారు. బ్రహ్మ సూత్రాలు, భగవద్గీతకు భాష్యం వెలయించారు. ఆయన కేవలం వేదాంతి కాదు. సమత, మమతలను నిత్య జీవితంలో ఆచరించిన పుణ్య యోగి. అనేక ప్రత్యేక సేవలను భగవదారాధనలో భాగంగా చేసి, విలక్షణ పూజా విధానాన్ని వ్యాప్తి చేశారు.

తత్వాలు భిన్నంగా గోచరించినా గమ్యం ఒక్కటే. పుణ్య శ్లోకులు సదా స్మరణీయులే. ●



# నాస్తికుడు ఆస్తికుడైన వేళ

చిత్రనిర్మాత సాండొ చిన్నప్ప దేవార్ మరియు ప్రఖ్యాత తమిళ కవి కన్నదాసన్ ఇద్దరూ ప్రాణ స్నేహితులు. ఒక సినిమా షూటింగ్ నిమిత్తం కార్లో వెళ్తుండగా కారు ప్రమాదానికి గురైంది. దేవార్ చిన్న చిన్న దెబ్బలతో తప్పించుకున్నాడు కాని కన్నదాసన్ మాత్రం తీవ్రమైన గాయాలతో స్పృహ కోల్పోవడంతో... మద్రాసులోని ఆసుపత్రిలో చేర్పించారు.

దేవార్ కు పరమాచార్య స్వామి అంటే అమితమైన భక్తి. వెంటనే తేనంబాక్కం శివస్థానంలోని బ్రహ్మపురీశ్వర దేవస్థానంలో మకాం చేస్తున్న మహాస్వామి వారిని దర్శించుకోవడానికి వెళ్ళాడు.

"ఒక ప్రమాదం జరిగింది" అని స్వామితో చెప్పాడు దేవార్.

వెంటనే స్వామివారు "కన్నదాసన్ ఎలా ఉన్నాడు?" అని అడిగారు.

తను ఏమి చెప్పకనే మహాస్వామివారు కన్నదాసన్ ఎలా ఉన్నాడు అని అడగటంతో దేవార్ ఆశ్చర్యపోయాడు. ప్రమాదం నుండి తను ఎలా బయటపడ్డాడు, కన్నదాసన్ ఎలా తీవ్రంగా దెబ్బతిని అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చేరాడు అన్న విషయమంతా స్వామివారికి విన్నవించాడు.

దేవార్ ఆత్రుతని గమనించి మహాస్వామి వారు "దిగులు పడకు ఏమి పరవాలేదు" అని అతణ్ణి సముదాయించారు. ఆస్పత్రిలో ఉన్న కన్నదాసన్ నుదుటిపైన విభూతి పెట్టి, కొద్దిగా నోట్లో వేసి మిగిలిన దాన్ని దిండు కింద ఉంచమని స్వామివారే స్వయంగా విభూతిని పొట్లం కట్టి ఇచ్చారు. దేవార్ సంకోచిస్తూ విభూతిని అందుకున్నాడు.

ఎందుకంటే కన్నదాసన్ పరమ నాస్తికుడు. దైవాన్ని నమ్మేవాడు కాదు. అప్పటికే కన్నదాసన్ ద్రావిడ పార్టీల నాస్తిక కార్యకలాపాల్లో, వాటి వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. బ్రాహ్మణుల గురించి, సనాతన ధర్మం గురించి చాలా చెడుగా మాట్లాడేవాడు. నిజానికి ప్రమాదం జరగడానికి వారం రోజులముందు కూడా కంచిలోని శంకర మఠం ఎదురుగుండా జరిగిన ఒక సభలో శంకరాచార్యుల (కంచి పీఠాధిపతుల) చిత్తరువును అవమానపరిచాడు. మరి ఇప్పుడు అటువంటి వ్యక్తికి ఈ విభూతి ఎలా ఇచ్చేది అని ఆలోచిస్తున్నాడు దేవార్.

ఆ త్రికాలజ్ఞాని దేవార్ పరిస్థితిని అర్థం చేసుకుని దేవార్‌తో ఇలా అన్నారు.

"ఏమి అనుమానపడకుండా వెళ్ళి కన్నదాసన్ నుదుటన ఈ విభూతి పెట్టు. చిన్న మేఘం కాసేపు సూర్యుణ్ణి అడ్డుకున్నట్టు, ఈ నాస్తికత్వం అతణ్ణి అడ్డుకుంది. ఇప్పటి నుండి అతను సూర్యునివలె ప్రకాశిస్తాడు. వారి పూర్వీకులు ఎంతటి మహాత్ములో నీకు తెలుసా? వారి ముత్తాత కంచి వరదరాజ పెరుమాళ్ ఆలయాన్ని పునరుద్ధరించారు. వారి తాత కంచి ఏకాంమ్రేశ్వర దేవస్థానాన్ని పునరుద్ధరించారు. వారి తండ్రి కంచి కామాక్షి అమ్మవారి దేవస్థానాన్ని పునరుద్ధరించారు. అతను దేవాలయాలను సంరక్షించే మహానుభావుల వంశంలో జన్మించాడు. ఇప్పుడు నీకు అర్థమైందా?"

దేవార్ ఆస్పత్రికి వెళ్ళి స్వామివారు చెప్పినట్టు చేసాడు. స్వామివారు ఇచ్చిన విభూతిని కన్నదాసన్ నుదుటన పెట్టి కొంచం నోట్లో వేసి, మిగిలినదాన్ని దిండు కింద పెట్టాడు. అప్పుడు సాయం సంధ్యా సమయం. తమిళ సాహిత్యానికి రాజైన కవి అరసు(కవి రాజు) కన్నదాసన్ ఇంకా అపస్మారక స్థితిలోనే ఉన్నాడు. దేవార్ విశ్రాంతి కొరకై రాత్రికి ఇంటికి వెళ్ళి తన స్నేహితుణ్ణి చూడాలని ఉదయాన్నే మరలా వచ్చాడు. స్పృహలోకొచ్చిన కన్నదాసన్ కు ఏమి చెప్పాలా అని ఆలోచిస్తూ రాత్రి అంతా గడిపాడు.

మరుసటి రోజు ఆసుపత్రికి రాగానే కన్నదాసన్ స్పృహలోకి వచ్చి కళ్ళు తెరిచి అలాగే మంచంపై పడుకుని ఉండడం చూసి ఆనందపడ్డాడు. "నేను ఎన్ని రోజులనుండి ఈ ఆసుపత్రిలో ఉన్నాను? నా మొహం చూసుకోవాలి అద్దాన్ని తీసుకుని రా" అని చెప్పాడు. దేవార్ అద్దం తెచ్చిచ్చాడు. అద్దంలో తన మొహాన్ని, నుదుటిపై ఉన్న విభూతిని చూసి అతను కోప్పడలేదు. బదులుగా ఎవరు పెట్టారు అని అడిగాడు. దేవార్ కొంచం ధైర్యం తెచ్చుకుని తను పరమాచార్య స్వామిని కలవడమూ, వారు అతణ్ణి అనిగ్రహించడమూ మొదలగు అన్ని విషయాలు కన్నదాసన్ కు చెప్పాడు.

అంతా వినగానే కన్నదాసన్ కన్నీళ్ళపర్యంతం అయ్యాడు. "నన్ను కరుణించారా? నా పైన ఇంతటి దయ చూపించారా? కేవలం వారం రోజుల ముందు నా చేష్టలతో, మాటలతో వారిని అవమానపరిచాను. ఎంతటి పాపిని నేను?" అని భోరున విలపించాడు. "పూర్తి స్వస్థత పొందిన తరువాత నేను మొదట నా ఇంటికి వెళ్ళను. ఇంతటి పాపిని అనుగ్రహించిన ఆ మహాత్ముని వద్దకు ముందు నన్ను తీసుకుని వెళ్ళు" అని దేవార్ ను అర్థించాడు.

అతని కోరిక ప్రకారం మహాస్వామివారిని దర్శించుకుని తనని క్షమించవలసిందిగా పలువిధాల ప్రార్థించాడు. అప్పటి నుండి నాస్తికత్వం నుండి ఆధ్యాత్మికత వైపు మళ్ళాడు. మనసులో భక్తిభావం పొంగగా మహాస్వామి వారిపై కవిత రాసాడు. మరలా స్వామిని దర్శించినప్పుడు దాన్ని వారికి సమర్పించాడు.

"ఎవరి కనుచూపుచేతనే అన్ని పాపాలు నశించిపోతాయో
ఎవరు తిరువాచకానికి సాకార స్వరూపమై నిలచినారో
ఎవరు తన మేధస్సు చేత సత్యా జ్ఞానానికి అర్థం చెప్పగలరో
ఎవరు ఈ విశ్వాన్ని రక్షించాడానికి వచ్చిన విశ్వనాథుడో
ఎవరు అన్ని మతాల చేత తమ దేవుడని ఒప్పబడినాడో
అటువంటివారి చరణారవిందములకు మనల్ని సమర్పించుకుందాము రండి! అందరూ తరలిరండి!!"

మహాస్వామివారు పద్యాన్ని చదివి కన్నదాసన్ తో "నువ్వు చెప్పినది కేవలం శేషాద్రి స్వామివారికి మాత్రమే సరిపోతుంది. ఆయనే తిరువణ్ణామలై అర్ధనారీశ్వరుడు. ఆయనే సత్పురుషుడు, మహామనీషి" అని అన్నారు.

"సనాతన ధర్మ వైభవాన్ని గురించి మనస్పూర్తిగా రాయి" అని ఆశీర్వదించి పంపారు.

అప్పుడే కన్నదాసన్ మనసులో బీజం పడింది. అది చిగురించి, చిన్న మొక్కై, మహావృక్షమై మహత్తరమైన "అర్థముల్లా హిందు మతం – అర్థవంతమైన హిందూ మతం" అనే పుస్తకమై వర్ధిల్లింది.

**లోకా సమస్తా సుఖినోభవన్తు!**



# పళని పుణ్యక్షేత్రం

శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి యొక్క ఆరు ప్రఖ్యాత క్షేత్రములలో నాలుగవది పళని. ఈ క్షేత్రం తమిళనాడు లోని దిండిగల్ జిల్లాలో, మధురై నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి క్షేత్రాలలో చాలా ప్రఖ్యాతి గాంచిన మహా మహిమాన్వితమైన దివ్య క్షేత్రం పళని. ఇప్పుడు ఉన్న మందిరం క్రీస్తు శకం ఏడవ శతాబ్దంలో కేరళ రాజు అయిన చీమన్ పెరుమాళ్ నిర్మించారు. ఆ తరువాత పాండ్యుల కాలంలో ఈ మందిరం ఇంకా అభివృద్ధి చేయబడింది.

"ఆరు పడై వీడు – పళని దండాయుధ పాణి స్వామి
పార్వతి నందనా... సుబ్రహ్మణ్యా"

## దండాయుధ పాణి

ఇక్కడ స్వామి వారిని దండాయుధపాణి అనే నామంతో కొలుస్తారు. తమిళులు ఈయనను "పళని మురుగా" అని కీర్తిస్తారు. ఈ క్షేత్రం చాలా పురాతనమైనది. స్వామి చేతిలో ఒక దండం పట్టుకుని, కౌపీన ధారియై, వృప్త కేశుడై నిలబడి, చిరునవ్వులొలికిస్తూ ఉంటాడు. అదే స్వరూపం భగవాన్ శ్రీరమణ మహర్షిది. భగవాన్ రమణులు సుబ్రహ్మణ్య అవతారము అని పెద్దలు చెప్తారు. ఇక్కడ స్వామి వారు కేవలం కౌపీనంతో కనబడడంలో అంతరార్థం "నన్ను చేరుకోవాలంటే అన్నీ వదిలేసి నన్ను చేరుకో" – అని మనకి సందేశము ఇస్తున్నారు.

## ఆలయ గర్భ గుడి గోపురం

ఇక్కడ పళని మందిరంలోని గర్భ గుడిలోని స్వామి వారి మూర్తి నవపాషాణము లతో చేయబడినది. ఇటువంటి స్వరూపం ప్రపంచములో మరెక్కడా లేదు. ఈ మూర్తిని సిద్ధ భోగార్ అనే మహర్షి చేశాడు. తొమ్మిది రకాల విషపూరిత పదార్థాలతో (వీటిని నవపాషాణములు అంటారు) చేశారు. పూర్వ కాలంలో ఇక్కడ పళని స్వామి వారి మూర్తిలో ఊరు (తొడ) భాగము వెనుక నుండి స్వామి వారి శరీరం నుండి విభూతి తీసి కుష్ఠ రోగం ఉన్నవారికి ప్రసాదంగా ఇస్తే, వారికి వెంటనే ఆ రోగం పోయేదని పెద్దలు చెప్తారు. అలా ఇవ్వగా ఇవ్వగా, స్వామి వారి తొడ భాగం బాగా అరిగి పోవడంతో అలా ఇవ్వడం మానేశారు. ఇప్పటికీ స్వామి వారిని వెనుక నుండి చూస్తే ఇది కనబడుతుంది అని పెద్దలు చెప్పారు. కాని మనకి సాధారణంగా ఆ అవకాశం కుదరదు.

## పళని క్షేత్ర స్థల పురాణము

పూర్వము విఘ్నాలకు అధిపతిని ఎవరిని చెయ్యాలి అని, పార్వతీ పరమేశ్వరులు ఒకనాడు మన బొజ్జ వినాయకుడిని, చిన్ని సుబ్రహ్మణ్యుడిని పిలిచి ఈ భూలోకం చుట్టి (అన్ని పుణ్య నదులలో స్నానం ఆచరించి ఆ క్షేత్రములను దర్శించి రావడం) ముందుగా వచ్చిన వారిని విఘ్నములకు అధిపతిని చేస్తాను అని శంకరుడు చెప్తే, అప్పుడు పెద్దవాడు, వినాయకుడు యుక్తితో ఆది దంపతులు, తన తల్లి తండ్రులు అయిన ఉమా మహేశ్వరుల చుట్టూ మూడు మాట్లు ప్రదక్షిణ చేస్తాడు. మన బుజ్జి షణ్ముఖుడు ఆయన యొక్క నెమలి వాహనముపై భూలోకం చుట్టి రావడానికి బయలుదేరతాడు. కాని, వినాయకుడు "తల్లి తండ్రుల చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేస్తే సకల నదులలోనూ స్నానం చేసిన పుణ్యం వస్తుంది" అనే సత్యము తెలుసుకుని, కైలాసంలోనే ప్రదక్షిణలు చేస్తూ ఉండడం వల్ల, సుబ్రహ్మణ్యుడు ఏ క్షేత్రమునకు వెళ్ళినా, అప్పటికే అక్కడ లంబోదరుడు వెనుతిరిగి వస్తూ కనపడతాడు. ఈ విధంగా వినాయకుడు విఘ్నాలకు అధిపతి అయ్యాడు. ఈ కథ మనకు అందరకూ తెలిసినదే.

కార్తికేయుడు శివ కుటుంబంలో చిన్న వాడు కదండీ, దానితో కాస్త చిన్న మొహం చేసుకుని కైలాసం వదిలి, భూలోకంలోకి వచ్చి ఒక కొండ శిఖరం మీద నివాసం ఉంటాడు అలకతో. ఏ తల్లి తండ్రులకైనా పిల్లవాడు అలిగితే బెంగ ఉంటుంది కదండీ, అందులోనూ చిన్న వాడు, శివ పార్వతుల ఇద్దరి అనురాగముల కలపోత, గారాల బిడ్డ కార్తికేయుడు అలా వెళ్ళిపోతే చూస్తూ ఉండలేరు కదా, శివ పార్వతులు ఇద్దరూ షణ్ముఖుని బుజ్జగించడం కోసం భూలోకంలో సుబ్రహ్మణ్యుడు ఉన్న కొండ శిఖరం వద్దకు వస్తారు.

## శంకరుడు సుబ్రహ్మణ్యుని బుజ్జగిస్తూ

ఆ కొండ శిఖరం ఉన్న ప్రదేశమును తిరు ఆవినంకుడి అని పిలుస్తారు. పరమశివుడు ప్రేమతో సుబ్రహ్మణ్యుడిని ఎత్తుకుని, " నువ్వే సకల జ్ఞాన ఫలానివి రా నాన్నా" అని ఊరడిస్తాడు. సకల జ్ఞాన ఫలం (తమిళంలో పలం), నీవు (తమిళంలో నీ) – ఈ రెండూ కలిపి పళని అయ్యింది. అంతటితో ప్రసన్నుడు అయిన సుబ్రహ్మణ్యుడు ఎప్పటికీ శాశ్వత ముగా ఆ కొండమీదే కొలువు ఉంటానని అభయం ఇస్తాడు. సుబ్రహ్మణ్య క్షేత్రాలలో జరిగే "కావడి ఉత్సవం" మొట్ట మొదట ఈ పళని లోనే ప్రారంభం అయ్యింది.

## కావడి ఉత్సవము - ఇడుంబన్ వృత్తాంతం

## ఇడుంబుడు


సుబ్రహ్మణ్య స్వామి వారి యొక్క గొప్ప శిష్యులలో అగస్త్య మహా ముని ఒకడు. అగస్త్య మహా ముని స్వామి దగ్గర నుండి సకల జ్ఞానము పొందాడు. అగస్త్య మహర్షికి ద్రవిడ వ్యాకరణము సుబ్రహ్మణ్య స్వామి వారే నేర్పారు.

పూర్వము దేవ దానవ యుద్ధములో చాలా మంది దానవులు నిహతులై పోయారు. కాని అందులో ఇడుంబన్ అనే ఒక రాక్షసుడు మాత్రం అగస్త్య మహర్షి పాదములు పట్టుకున్నాడు. అగస్త్యుడు సంతోషించి, వీడిలో మిగిలిపోయిన కొద్ది

రాక్షస భావాలు తొలగించాలి అనుకున్నాడు. సాధారణంగా ఎవరైనా పెద్దలు తన వల్ల కాని పని ఉంటే, తన గురువుకి అప్పచెప్తారు. వీడు రాక్షసుడు కదా అని సంహరించడం కాదు, వీడిలో ఉన్న ఆసురీ గుణములను తీసివేయాలి అని తలచి, లోకంలో ఆదిగురువు దక్షిణా మూర్తి, శంకరుడు ఉండేది కైలాసంలో కదా, అందుకని ముందు అక్కడికి పంపిద్దాము అనుకుని ఇడుంబుడిని పిలిచి, "ఒరేయ్ నేను కైలాసం నుండి రెండు కొండలు తెద్దామని చాలా కాలం నుండి అనుకుంటున్నాను, వాటిని శివగిరి, శక్తిగిరి అంటారు. నువ్వు వెళ్లి ఆ రెండు కొండలను, ఒక కావిడిలో పెట్టుకుని నేను ఉన్న చోటికి తీసుకురా" అని ఆజ్ఞాపించాడు.

సరే ఇడుంబుడు, వంట్లో ఓపికుంది కదా, కైలాసం వెళ్లి ఆ రెండు కొండలను తన కావిడిలో పెట్టుకుని బయలుదేరతాడు. శంకరుడు అనుకుంటాడు, ఈ రాక్షసుడి ఆసురీత్వం పోగొట్టడం, జ్ఞాన రాశి అయినటువంటి మా సుబ్రహ్మణ్యుడు చేస్తాడులే అనుకుని ఇడుంబుడిని వెళ్ళనిస్తారు. ఇక్కడ స్వామి పళని కొండ మీద చిన్న పిల్లవాడిగా ఉన్నాడు, ఇడుంబుడు దారిలో వస్తూ ఉండగా సరిగ్గా పళని దగ్గరకి వచ్చే సరికి ఆ కొండలు మోయలేక ఆయాసం వచ్చి, కాసేపు క్రింద పెట్టి సేద తీరాడు.

మళ్ళీ కావిడి ఎత్తుకుందామని క్రిందకి వంగి కావిడి బద్ధ భుజం మీద పెట్టుకుని లేచి నిలబడి, రెండు వైపులా బరువు సమానంగా ఉండేలా సర్దుదామని చూస్తే ఒక వైపు ఎక్కువ బరువు, ఇంకో వైపు తేలిక అవుతోంది కాని, సమానంగా ఎంతసేపటికీ కుదరట్లేదు. ఇంక విసుగొచ్చి, ఏమిటిరా ఈ కావిడి అనుకుని, అలా పైకి చూస్తాడు ఇడుంబుడు. పైకి చూడగానే అక్కడ సుబ్రహ్మణ్యుడు చిన్న పిల్లవాడి రూపంలో పకపక నవ్వుతున్నాడు. ఇది చూసి వీడికి కోపం వచ్చింది. ఇదే రాక్షస ప్రవృత్తి అంటే, ఏదో చిన్న పిల్లవాడు నవ్వుతున్నాడులే అనుకోవచ్చు కదా. స్వామికేసి తిరిగి "ఏమిటా నవ్వు, నేనేమైనా ఈ కావిడి ఎత్తలేనని అనుకుంటు న్నావా? కైలాసం నుంచి తీసుకొచ్చాను. ఏమిటా వెర్రి నవ్వు, నిన్ను చంపేస్తాను ఇవ్వాళ అని ఆ కొండ మీదకి పరిగెత్తాడు. తెలిసి పరిగెత్తాడో, తెలియక పరిగెత్తాడో పళని కొండ మీదకి పాదచారియై వెళ్లాడు. పైకి వెళ్ళాక, స్వామి రెండు గుద్దులు గుద్దాడు, ఇంక ప్రాణం వదిలేస్తున్నాను అన్నప్పుడు, వాడికి తెలిసింది, ఈ పిల్లవాడు సామాన్యుడు కాదురా, మా గురువు గారికి (అగస్త్యుడు) గురువు, సాక్షాత్తు ఈశ్వర పుత్రుడు.





అప్పుడు వేడుకుంటాడు "ఈశ్వరా తెలుసుకోలేకపోయాను, మీ చేతి గుద్దులు తిన్నాను, నాకు వరం ఇవ్వండి" అన్నాడు. ఏమిటో అడుగు అన్నాడు స్వామి. ఇడుంబుడు అన్నాడు, "స్వామీ, నేను ఈ పళనిలోనే కదా, కావిడి ఎత్తలేకపోయాను, ఈ కావిడి వల్లనే కదా, మిమ్మల్ని చేరడానికి మార్గం అయ్యింది, అందుచేత లోకంలో ఎవరైనా సుబ్రహ్మణ్యుడిని ఏ ఆరాధనా చెయ్యకపోయినా, ఒక్కసారి కావిడి పాలతో కాని, విభూతితో కాని, పూలతో కాని, తేనెతో కాని, నేతితో కాని భుజం మీద పెట్టుకుని, మేము సుబ్రహ్మణ్యుడి దగ్గరకి వెళ్ళిపోతున్నాం అని పాదచారులై నీ గుడికి వస్తే, అటువంటి వాళ్ళు సుబ్రహ్మణ్యారాధన, శాస్త్రంలో ఎన్ని విధాలుగా చెయ్యాలని ఉందో, అంత ఆరాధనా చేసిన ఫలితం వాళ్లకి ఇచ్చేసెయ్యాలి" అన్నాడు ఇడుంబుడు.

స్వామి అనుగ్రహించి సరేనని ఆ కోరికని కటా క్షించి, ఇక పైన నా దగ్గరకు వచ్చే భక్తులు ఎవరైనా ముందు నీ దర్శనం చేసి నావద్దకు రావాలని వరం ఇచ్చాడు. అందుకే అప్పటి నుంచి అన్ని సుబ్రహ్మణ్య క్షేత్రాలలో (ప్రత్యేకంగా తమిళనాడులో) స్వామి వారిని చేరే మార్గంలో ఇడుంబుడి మూర్తి ఉంటుంది, అక్కడ ఆయనకు నమస్కరించిన తరువాతే, సుబ్రహ్మణ్యుని దర్శనము చేసుకుంటారు.

## సుబ్రహ్మణ్య కావడిలు

అప్పటి నుంచి, తమిళ దేశం వాళ్ళు సుబ్రహ్మణ్య కావిళ్ళు ఎత్తి, సుబ్రహ్మణ్యుడిని తమ దైవం చేసేసుకున్నారు. అంతే కాక, ప్రతీ ఏటా స్కంద షష్ఠి ఉత్సవాలలో ఏ దంపతులైతే, భక్తితో, పూనికతో స్వామికి నమస్కరించి ఈ కావడి ఉత్సవంలో పాల్గొంటారో వాళ్లకి తప్పక సత్సంతాన ప్రాప్తి కలుగుతుంది. వారి వంశంలో సంతానము కలగక పోవడం అనే దోషం రాబోయే తరాలలో ఉన్నా కూడా ఆ దోష పరిహారం చేసి స్వామి అనుగ్రహిస్తాడు అని పెద్దలు చెప్తారు. దీనినే కావిళ్ళ పండగ అని అంటారు. ●



# పరమార్థ కథలు




**శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు**

## జ్ఞానోదయము

పూర్వకాలమున ఒకానొక పట్టణమున ఒక ధనికుడుండెడివాడు. అతడు వ్యాపారముద్వారా లక్షలకొలది ఆస్తిని సంపాదించెను. ఒకనాడతని కొక సంకల్పము జనించెను. అది యేదనగా – “ఈ ప్రపంచమున ఎందఱో చక్కని గృహములను, సౌధములను నిర్మించుకొని కాపుర ముండుచున్నారు. నాకు పరమాత్మ కోట్లకొలది ధనమును ప్రసాదించినాడు. అట్టిచో ఈ చిన్న గృహమునందే నాజీవితమును గడుపనేల? బ్రహ్మాండమైన ప్రాసాదమును, రాజభవనమును ఏల నిర్మించుకొని కాపుర ముండరాదు? కావున ఎన్ని లక్షలద్రవ్యము నైనను ఖర్చుపెట్టి ఇంతవఱకు కని విని ఎఱుగనట్టి, అపూర్వభవనమును నిర్మించుకొని అందు నివసించెదను” అని ఈ ప్రకారముగ ఆ ధనికుడు గొప్పగొప్ప మేస్త్రీలను వేలకొలది కార్మికులను నియోగించి రెండు సంవత్సరములలో రమణీయమగు హర్మ్య మొకదానిని నిర్మింపజేసెను.

ఆ ప్రాసాదము అత్యంత మనోహరముగ నున్నదై రాజభవనములను గూడ మఱిపింప జేయుచుండెను. పది అంతస్తులు గల బ్రహ్మాండమైన సౌధమది, ప్రతి అంతస్తునందును నవీనపద్ధతులతో ఏర్పాటు చేయబడిన చిత్ర విచిత్ర పరికరము లెన్నియో అమర్చబడి కనుల పండువుగా నుండెను. ముఖ్యముగా అన్నిటికంటె పైనున్న అంతస్తు ప్రత్యేక అలంకారములతో గూడినదై, స్నానపానాది సమస్త సౌకర్యములతో గూడి, చూచుటకు ముచ్చట గొలుపుచుండెను. ధనికుడు క్రింద నున్న తొమ్మిది అంతస్తులను అద్దెకిచ్చి తాను మాత్రము కుటుంబముతో సహా పదవ అంతస్తునందు కాపురముండుచుండెను. కనుకనే అద్దానిని ఎంతయో మనోహరముగ తీర్చిదిద్దెను. ఆ భవనము, అందును ముఖ్యముగ ధనికుడు స్వయముగ వసించు పదవ అంతస్తు చూపరులకు దిగ్భ్రమ గొలుపుచు మయుని సృష్టిని జ్ఞాపకమునకు దెచ్చుచుండెను.

ధనికుడు తాను నిర్మించిన గృహమును జూచి మురిసి పోవుచుండెను. ఆ పట్టణమునకు పెద్దలెవరు విచ్చేసినను వారిని తన గృహమునకు తీసికొనివచ్చి అంతయు చూపించి పంపుచుండెను. ఒక విజిటర్స్ బుక్ (Visitors Book) ఏర్పాటుచేసి తన భవనమును గూర్చి ఇతరులచే వారి అభిప్రాయములను అందు లిఖింపజేయుచుండెను. ప్రతివారును తామిట్టి సర్వాంగ సుందరభవనము నింతవఱకెచటను కని విని యుండలేదనియు, ఇది లోకోత్తర సుందర భవనమనియు అందువ్రాసి వెళ్ళుచుండిరి. వారి యాఅభిప్రాయములను తిలకించి ధనికుడు పరమానంద భరితు డగుచుండెను.

ఇట్లుండ ఒకనా డాపట్టణమున కొక సాధువు విచ్చేసెను. ధనికుడు ఆ సాధువుగారిని తన యింటికి ఆహ్వానించి భిక్ష ఏర్పాటు చేసి, భోజనానంతరము తన గృహమంతయు ఆతనికి చూపెను. క్రిందనున్న తొమ్మిది అంతస్తులను ముందుగా చూపి తుదకు తాను స్వయముగ నివసించుచున్న పదవఅంతస్తునకు సాధువుగారిని తీసికొని వెళ్లి అచటగల ప్రతివస్తువును వివరించి చెప్పుచు అంతయు చూపెట్టెను. సాధువుగారు అచటచట గల ఆధునిక సౌకర్యములను, మిరుమిట్లు గొలుపు చిత్రవిచిత్ర వస్తుసామాగ్రిని, అలంకారములను జూచి పరమాశ్చర్యము నొందెను. ఈ ప్రకారముగ అంతయు చూపించిన పిదప ధనికుడు – మహాత్మా! ఈ గృహమును గూర్చి మీయభిప్రాయమును తెలియజేయుడని కోరగా, అంతట సాధువుగారిట్లు వచించిరి. ‘ఓయీ! ఇట్టి దివ్యభవనమును నేనింతవఱకెచటను చూచి యుండలేదు. ఇది అపూర్వముగ నున్నదై చూపరులకు మహోల్లాసమును గలుగజేయుచున్నదనుటలో ఏలాంటి సందియమును లేదు. అయితే ఒక్క విషయమున మాత్రము నాకు చాలదిగులు కలుగుచున్నది. ఈ మిద్దెపై మీరు చనిపోయినపుడు మిమ్ములను దింపుట కష్టము. మీ శవమును పదిఅంతస్తులనుండి దింపవలెనన్న చాల కష్టము!’

ఆ వాక్యములను వినగనే ధనికుని గుండె బ్రద్దలయ్యెను. భవిష్యత్తులో తనకు మృత్యువు సంభవించుననిగాని, అపుడు తనకును తన భవనమునకును ఎడబాటు కలుగునని అతడు కలలోనైన ఊహించలేదు. తాను, తన భవనము శాశ్వతమని తలంచి దానిని గాంచి మైమరచి పోవుచుండెను. అట్టి సమయమున సాధువుగారు ధనికునకు కనువిప్పు కలిగించెను. భవిష్యత్తులో జరుగబోవు ఒక మహా ప్రమాదము నాతనికి గుర్తునకు వచ్చెను. అదియే మృత్యువు. దానిని మఱచి జనులు భోగ విలాసములలో మునిగి, ప్రాపంచిక వ్యవహారములలో నిమగ్నులై, నామరూప జగత్తు సత్యమని నమ్మి  విషయముల వెంట పరుగిడుచు తమ సౌందర్యము, తమకీర్తి తమ అధికారము తమ ప్రతిష్ఠ, తమ గృహారామాదులు చూచి మురిసిపోవుచున్నారు. సాధువు వచించిన వాక్యముద్వారా ధనవంతునకు ప్రపంచవస్తు స్వరూపము దృగ్గోచర మయ్యెను. బాహ్యావస్తువుల క్షణికత్వము అనుభూతమయ్యెను. ఆతనికి జ్ఞానోదయము కలిగెను. అప్పటి నుండియు అతడు తన భవనముపై గాని, ఇతర వస్తువుల పైగాని మమత్వ ముంచక, అట్టి క్షణిక వస్తుజాలముపై విరక్తి గలిగి శాశ్వతమగు పరమాత్మనే ఆశ్రయించి, జప, ధ్యానపరాయణుడై జీవితమును సద్వినియోగ  పఱచుకొనెను.

నులు తమ సంపదలను, వైభవములను జూచి విఱ్ఱవీగరాదు.

**‘జమా కురు ధన జన యౌవనగర్వం**

**హరతి నిమేషాత్కాలస్సర్వం’** ●

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

# తెలుగు వాళ్ళు లేనిదెక్కడ! భాషా వెలుగుల్లేవక్కడ!

'విశ్వమంతటా విభుడున్నాడు. విభుడున్న చోటల్లా తెలుగు వెలుగున్నది' - అంటూ ఊహ తెలియని రోజుల్లో ఊసుపోని కవితలల్లాను. కానీ నేను తిరిగిన వివిధ ప్రదేశాల పర్యటనను బట్టీ, వివిధ దేశాల్లో ఉంటున్న తెలుగువారిని కలుసుకొనడంబట్టీ - తెలుగువాడు విశ్వమంతటా ఉన్నాడనీ, తెలుగువాడి మనంలో మాత్రం తెలుగు భాష లేదని గ్రహించాను. తాను తెలుగు వాడినని చెప్పుకొంటాడు, కానీ తెలుగు మాట్లాడడు. తన సంతతికి తెలుగు నేర్పడు. వేల సంవత్సరాలుగా నేలపైనున్న యీ తెలుగు భాష "నేలపాలే కావాల్సింది. కానీ కాలేదు. కారణం అలనాటి తెలుగు భాష ఆధ్యాత్మిక చింతనంతో బయల్దేరింది. ఆధ్యాత్మిక గ్రంథ రచనలతో ప్రారంభమైంది. ఆధ్యాత్మిక తత్వాన్నీ, ఆరాధనా తత్వాన్నీ, ప్రేమ తత్వాన్నీ, ప్రాచీన వేద తత్వాన్నీ, సంస్కృతీ పరమైన సంస్కృత పదాల సొగసుల్నీ సువర్ణాభరణాల్లో విలువైన నవరత్నాలను పొందుపరచినట్టు, కావ్యపరమైన, రసపరమైన, రసజ్ఞ పరమైన, భాష రసిక జన మనోభిరామంగా, మధురంగా, మంజులంగా, మనోహరంగా శబ్ద. అర్థ అలంకార సమ్మిశ్రతంగా. భక్తి రస సమన్వితంగా, నీతి బద్ధంగా, హేతు బద్ధంగా, ధర్మబద్ధంగా 'మూస' వేసిన విధం, విధానాన్నీ కావ్యకర్తలే విశ్లేషించాలి గానీ, రసాస్వాదనం చేసే నావంటి సామాన్యుడు విశ్లేషించలేడు. ఇటు కన్యాకుమారికి దిగువనున్న శ్రీలంక, అటు తలపై పింఛముల్లా కుడివైపునున్న టిబెట్, నేపాల్, ఇటూ అటూ రెండు భాగాలైన బంగ్లాదేశ్, పాకిస్తాన్, బర్మా, మలేషియా, మార్షియస్, ఆస్ట్రేలియా, అమెరికా, కెనడా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఫిజీ, బ్రెజిల్, స్పెయిన్, స్వీడన్, న్యూజిలాండ్, ఐర్లాండ్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, అరేబియా, దుబాయ్, కువాయిట్ వంటి ఇతర గల్ఫ్ దేశాలు, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, మెక్సికో, ఆఫ్ఘనిస్తాన్, బెలుచిస్థాన్, టర్కీ అన్ని దేశాల్లోనూ తెలుగు వారున్నారు. అప్పుడప్పుడు తమ బంధువుల ఇళ్ళకు వస్తుంటారు. ఫోన్లు చేస్తుంటారు. ఉత్తరాలు వ్రాస్తుంటారు.

రవి గాంచనిది కవిగాంచును అన్నారు గానీ, రవీ, కనీ గాంచని ప్రదేశాలకు కూడా తెలుగు వారు ఏవో ప్రయోజనాలను వెదుక్కుంటూ, వేలయోజనాల దూరం, రహదారీ, ప్రయాణ సౌకర్యాలు లేని కాలంలో వెళ్ళిపోయున్నారు. యాంత్రిక యుగంలో యాంత్రికంగా బ్రతుకుతూ, తల్లి తండ్రులను మరిచినట్టే, తల్లిభాష, తెలుగును మరిచిపోయారు. అది నిత్యావసరం. కాదనుకున్నారు. కుంటున్నారు కూడా? తల్లిని తనయులు. మరచినా, తనయుల్ని తల్లి మరవకుండా అబ్బాయి ఫోను చేసాడు. కాదేc విటి, ఈ ఏడాది ఊరగాయలు కూడా పంపలేదు, వాడు తీసుకుని వెళ్ళలేదు, ఎలా ఉంటున్నాడో, ఏంతింటున్నాడో! ఫోనైనా చేయడం లేదు ఉత్తరం ముక్క ఎలాగూ వ్రాయడనుకోండి. అంటూ తల్లి, తల్లి హృదయంతో తల్లడిల్లిపోయి నట్టుగానే భావిస్తూ తల్లిభాష తెలుగు భాష కూడా తన్ను తనవారు మరిచిపోయారని ఎందుకు తల్లడిల్లిపోదు!! తొలుత తన క్షీరధారలతోనే అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ లు నేర్చుకుని 'A, B, C, లకు వెళ్ళాడు. ఉగ్గుపాలను 'ఉంగా ఉంగా' యని త్రాగిన తరువాతనే కదా 'Fast Food' లను తింటున్నాడు. అన్న ప్రాశనకు ముందే యివ్వన్నీ తినలేదు కదా, అక్షరాభ్యాసంలో 'ఓం నమః శివాయ' లు దిద్దకుండా వాడు అన్యభాషను. గ్రహించలేదు కదా! ఇపుడు తనసంతతినీ, సంపదనీ చూచుకుని మురిసిపోతూ, 'ఓడదాటే వఱకూ ఓడమల్లయ్యా, ఓడ దాటిన వెనుక బోడిమల్లయా' అని, Mummy, Daddy, Uncle, Aunty, అంటాడా శుంఠయని తెలుగు తల్లి వాపోతున్నట్లు నాకనిపిస్తున్నది. 'కాటుక కంటిపై కన్నీరు చనంగన్' భారతీ (సరస్వతి) పై స్రవించిందని బమ్మెరపోతన వ్రాసిన పద్యం యొక్క మకుట పదం జ్ఞాపకం వచ్చి ఈ వ్యాసం వ్రాశాను. అప్పుడు పోతన కవితను అమ్ముకోవడానికి ఏడ్చాడు, ఇప్పుడక్కడ తెలుగువారి తెలుగు రానితనాన్ని జూచి ఏడుస్తున్నాను. ●


# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో - మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**
64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై - 33.
మొబైల్ : 98400 48941

# మహాత్ములుద్భవించడానికి వారి తల్లులే కారణం!

పుట్టుకలో లేని విశిష్టత పెంపకంలో ఉంటుందనీ మనిషిని కులాన్ని బట్టిగాని, గుణాన్ని బట్టి నిగ్గు తేల్చాలని ఇది వఱకు నేను అమెరికాలో నున్నపుడు Mothers Day సందర్భముగా ఒక వ్యాసాన్ని ప్రముఖాంధ్ర'లో వ్రాశాను. పిల్లలు మంచి పౌరులుగా, నీతిపరులుగా, ధర్మపరులుగా పెరగాలంటే తల్లి పెంపకం, తండ్రి ఆలనా, గురువు ఆశ్రయమూ చక్కగా అమరాలి. లేనిచో వారి కారణంగా దేశభవిష్యత్తు ప్రమాద భూయిష్టమవు తుందనెడి ఆనాటి నా వ్యాస సారంశం; ఇహ చదవండి:

బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ పెరిగి, బాధ్యత నెఱిగి, భగవాన్ సత్యసాయి బాబావారి మాతృమూర్తి ఈశ్వరమ్మ ఆరాధనోత్సవం మే 6న బెంగుళూరులోని వైట్ ఫీల్డులో వైభవంగా జరిగింది. దేశ విదేశాల నుంచి ఎంతో మంది భక్తజనం విచ్చేశారు. వారినుద్దేశించి శ్రీ సత్యసాయిబాబా వారు ప్రసందిస్తూ, మహాత్ములుగా, మహాపురుషులుగా తీర్చిదిద్దబడడానికి స్ఫూర్తి వారి తల్లులేనని చెప్పారు. కౌసల్యాదేవి, సీతామహాసాధ్వి, జిజియాబాయి, పుతలీ బాయిల కారణంగా వారి పుత్రులు మహాత్ములైనారన్నారు. ప్రపంచంలో కుపుత్రుల నైనా లెంగట్టి చెప్పవచ్చుగానీ, కుమాత ఉందని చెప్పలేమన్నారు. సుసంస్కృతితో కూడిన సమాజం యేర్పడాలంటే మహిళలు బాధ్యత వహించాలని, వారి భాధ్యత అతి గొప్పదనీ ప్రబోధించారు.



'మాతృదేవోభవ, పితృదేవోభవా' అని భారతీయ సంస్కృతి బోధిస్తున్నదనీ, ప్రతీ ఒకరూ తమ తల్లి తండ్రుల అభీష్టాలను నెరవేర్చాలనీ, జీవిత గమ్యం గ్రహించాలనీ హితవు చెప్పారు. సత్యం, ధర్మం, అహింస, ప్రేమలే ఆదర్శజీవితానికి మూలకాలనీ, వీటిని పాటిస్తే జీవితం ధన్యమవుతుందని చెబుతూ, ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలనుకునేడి మనిషి ఎంతటి కష్ట నిష్టూరాలొచ్చిననూ లెజ్జ చేయదనీ, సుఖాలను ఆశించే మనిషి కష్టాలను సహితమూ సమచిత్తంతో నెదుర్కోవాలన్నారు. పరమాత్మ పైనెక్కడో లేదనీ సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే వేదాంత వాక్యాన్ని బట్టి, అందరిలోనూ, అన్నిటిలోనూ పరమాత్మను చూడాలన్నారు బాబా.

అందరినీ ప్రేమించాలనీ, ప్రేమ అంటేని త్యాగమనీ త్యాగమయమైన వాత్సల్యంతో భగవసాన్నిధ్యం పొందవచ్చునని బాబా చెప్పారు. బంధువుల్ని, దేశాన్ని, జగత్తులోని మానవాళిని ప్రేమించాలి. సత్య ధర్మాలున్నచోట ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమే దైవం. ప్రేమరూపంలో దైవం అందరి హృదయాల్లోను నిక్షిప్తమై ఉన్నాడు. సత్యం, ధర్మం, ప్రేమ, మానవుని హృదయనుండీ ఆవిర్భవిస్తాయ్. హృదయం అంటేనే దయకలదని అర్థం, దయలేనివాడు మనిషే కాదు' అన్నారు బాబా. కేవలమూ మనిషిలో దయ అడుగంటుతున్నందుననే ప్రస్తుతం ప్రకృతి. వైపరీత్యాలు, కరువు కాటకాలు ఉత్పన్నమవుతున్నాయని, దీనికి దైవం బాధ్యుడు కాదనీ, దయ, సత్యం, ధర్మం మానవునిలో పాదుకుంటే జగత్తు సుభిక్షం అవుతుంది. ఇక్కడ ఈ సందర్భముగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారి పద్యం జ్ఞాపకం వస్తున్నది.

సత్యంబే సకలార్ధ సాధకమగున్ సత్యస్థిరుండొందు నౌ
న్నత్యం బెల్లడలందు, సత్యమునుకన్నన్ మిన్నయా ధర్మముల్
స్తుత్యంబుల్ మఱిలేవు, సత్యము ఫలించు నాటికినే నేటికిన్
సత్యాసికండె నిత్యుడు, ప్రపంచ స్థాయి సత్యంబగున్;

బుద్ధిమతీ విలాసంలో బుద్ధిమతి సత్యమును గూర్చి బలిజేపల్లి విశ్లేషించిన ఈ పద్యంలో కూడా ఎంతటి భావుకత, సత్యశీలం కలదో గ్రహించండి.

ఇనుడపరదిక్కునందుదయించు గాక
అగ్నికుష్టత సెడి శైత్యమమరు గాక
గ్రహ సమూహంబు జలజల రాలుగాక
మఱపునకు నైన నాడిన మాటదాట – అంటుంది

బుద్ధిమతి. భారత పూర్వీకుల సత్యనిష్ట, ధృడమనస్తత్వం ఎటువంటివో తెలుపడానికే ఈ పద్యాలను సందర్భ శుద్ధిగా ఉటకరించడమైనది. భగవాన్ శ్రీ సత్య సాయిబాబావారి పరిశుద్ధ బోధనలూ యిలాంటివే! సులభగ్రాహ్యంగా బోధిస్తున్న శ్రీ బాబాకు పాద ప్రణామములు సమర్పిస్తున్నాను. ఆహారం, జలం, వైద్యం, విద్యలనేవి విక్రయించకూడదు. మానవునిలో దయ ఇంకిపోయినందువల్లనే భూమిలో నీరు కూడా ఇంకిపోతున్నది అన్నారు బాబా.

తమ మాతృమూర్తి ఈశ్వరమ్మ అసలు చదువుకోలే దనీ, పేదరికంలో సంగటి (రాగిముద్ద) శనక్కాయ పచ్చడితోనే కాలంగడిపారనీ, పుట్టపర్తి గ్రామ ప్రజలు వైద్యం కోసం పడే బాధలు చూచి ఆమె హృదయం ద్రవించిందనీ, అక్కడ ఆసుపత్రిని. కట్టమంటూ ఆమె కోరారనీ, ఆమె అభీష్టం మేరకే ఆసుపత్రిని కట్టించానని, ఆ ఆసుపత్రిని ప్రారంభించినపుడు తన హృదయం పరవశించి పోయిందనీ, చిత్తశుద్ధితో చేసిన ప్రతీపనీ సిద్ధిస్తుందని బాబా ఆశాభావం వెలిబుచ్చారు. మాతృ మూర్తి ఈశ్వరమ్మ ఆరాధన సందర్భముగా నారాయణ సేవను నిర్వహిస్తూ, నిరుపేదలకు నూతన వస్త్రాలు పంచారు. బాబావంటి ప్రేమమూర్తులు ఈ దేశంలో సజీవంగా నుండబట్టే కొంతగా కొంతయినా ధర్మం సజీవంగా ఉంది!!! ●






# కృష్ణం వందే జగద్గురుం

మహాభారతంలోని ప్రముఖులైన ఇద్దరు మహోన్నతులు – కృష్ణుడు, కర్ణుడు మధ్యన ఒకసారి మంచి చర్చ జరిగింది...

కర్ణుడు కృష్ణుడుని అడిగాడు...

నేను పుట్టీపుట్టగానే నన్ను నా తల్లి వదిలేసింది..

అశాస్త్రీయమైన జన్మను పొందడం అనేది నా తప్పా... కాదే...

ద్రోణాచార్యులు నాకు విద్య నేర్పేటందుకు నిరాకరించారు..ఎందుకంటే నేను క్షత్రియుని కాను అన్న కారణంతో...

పరశురాముడు నాకు విద్యనైతే నేర్పారు కానీ నేను క్షత్రియుడిగా గుర్తింపబడేవరకూ ఆ విద్యనంతా మరిచిపోయేలా నాకు శాపం పెట్టారు..

పొరపాటున నా బాణం ఒక ఆవుకి తగిలితే ఆ ఆవు యజమాని నా తప్పు లేకున్నా నన్ను నిందించారు..

ద్రౌపదీ స్వయంవరంలో నాకు పరాభవం జరిగింది..

ఈనాడు కుంతీమాత వచ్చి నేను తన పుత్రుడిని అని నాకు నిజం చెప్పటం వెనకనున్న కారణం కేవలం ఆవిడ తన వేరే పుత్రులను కాపాడుకోవటం కోసమే..

నేనంటూ ఏదన్నా పొందాను అంటే అది దుర్యోధనుని దయాధర్మం వల్లనే..

అలాంటప్పుడు నేను దుర్యోధనుని పక్షాన ఉండటం తప్పెలా అవుతుంది అని చెప్పాడు కర్ణుడు...??

దానికి కృష్ణుడు సమాధానంగా కర్ణునికి చెప్పాడు.

నేను పుట్టటమే కారాగారంలో పుట్టాను.

నేను పుట్టటం కంటే ముందే నా చావు నాకోసం కాచుకుని కూర్చుంది.

నేను పుట్టిన రాత్రే నా కన్న తల్లితండ్రి నుండీ వేరుచేయబడ్డాను.

చిన్నతనంలో నువ్వు కత్తులు, రథాలు, బాణాలు, గుర్రాలు ఇలాంటి శబ్దాల మధ్య పెరిగావు.

నేను గోశాలలో పేడ వాసనల మధ్యన ఉన్నాను...

నా చిన్నతనంలో నన్ను చంపేందుకు నా పైన ఎన్నో దాడులు జరిగాయి.. అప్పటికి నాకు నడిచే వయసు కూడా రాలేదు..కానీ ఎన్నో దాడులు ఎదుర్కున్నాను..

నాచుట్టూ ఉన్న వారు వారి సమస్యలకు నేనే కారణం అని నన్ను నిందించేవారు కూడా.

నాకు సైన్యమూ లేదు, విద్య కూడా లేదు.

మీరందరూ మీ విద్యాభ్యాసం పూర్తి చేసుకుని మీ ప్రతిభలకు మీ గురువుల నుంచీ అభినందనలు పొందే వయసుకి నేను విద్య నేర్చుకునేందుకు నోచుకోలేదు కూడానూ.

సాందీపుని రుషి వద్ద నా పదహారో ఏట నా చదువు ప్రారంభం అయ్యింది.

నువ్వు నీకు ఇష్టమైన అమ్మాయిని వివాహం చేసుకోగలిగావు.

నేను నాకిష్టమైన అమ్మాయిని చేసుకోలేకపోయాను..పైగా నన్ను వివాహం చేసుకున్నవారు..వారు నన్ను కోరుకుని కొందరూ, నేను రాక్షసుల నుండీ కాపాడబడినవారు కొందరూనూ.

రాసంధుని బారి నుంచీ కాపాడుకోవటానికి నా గోకులాన్నంతా నేను యమునవడ్డునుంచీ దూరంగా తీసుకెళ్ళాల్సివచ్చింది.

అప్పుడు పిరికివాడుగా పారిపోయానన్న చెడ్డపేరు నాకొచ్చింది.

సరే ఇంతకీ దుర్యోధనుడు ఈ యుద్ధం గెలిచాడే అనుకో నీకు మంచిపేరు వస్తుంది.

అదే ధర్మరాజు గెలిస్తే నాకేమీ రాదు... పైగా ఈ యుద్ధం మరియు యుద్ధానికి సంబంధించిన సమస్యలకూ నేనే కారణం అన్న నింద వేస్తారు అందరూ నాపైన.

ఒకటి గుర్తుంచుకో కర్ణా.

జీవితంలో సమస్యలు, సవాళ్ళు అందరికీ ఉంటాయి.

జీవితం ఏ ఒక్కరికీ పూలబాట కాదు..అన్నివేళలా అంతా సవ్యంగానే ఉండదు.

దుర్యోధనుడు అవనీ యుధిష్టరుడు అవనీ అందరూ జీవితపు దెబ్బలు రుచి చూసినవారే.

ఏది సరైనదో ఏది ధర్మమో నీ మనసుకి నీ బుద్ధికి తెలుసు.

మనకు ఎంత అన్యాయం జరిగినా.

మనకు ఎన్ని పరాభవాలు జరిగిన

మనకు రావల్సినది మనకు అందకపోయినా..

మనం ఆయా సమయాల్లో ఎలా ప్రవర్తిస్తామో అదే మన వ్యక్తిత్వం...అదే చాలా ముఖ్యమైనది.

జీవితం ఆటుపోట్లు భరించామనో, మనకు చెడు అనుభవాలు ఎదురయ్యాయనో... అనే కారణాలు మనకు అధర్మమార్గంలో ప్రయాణించేందుకు అనుమతిగా (licence) అనుకోకూడదు... మనం బాధపడ్డామని జీవితాన్ని చెడు మార్గంలోకి నడిపించకూడదు...ఏ పరిస్థితుల్లో అయినా ధర్మాన్ని వదులుకోకూడదు... అని కర్ణునికి కృష్ణుడు బోధించాడు. ●




రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై





# శయన హనుమంతుడు

హనుమంతుడు అనగానే అపారమైన పరాక్రమం... అసమానమైన మేథస్సు... విశ్వమంతటి వినయం గుర్తుకు వస్తాయి. భక్తుడు ఎలా ఉండాలో... భగవంతుడు ఎలా ఉండాలో కూడా నిరూపించిన హనుమంతుడు, అనేక ప్రాంతాల్లో వివిధ నామాలతో ఆవిర్భవించాడు. భక్తాంజనేయుడుగా... వీరాంజనేయుడుగా అభయాన్ని ప్రసాదిస్తూ వుండే స్వామి, ఎక్కడ చూసినా నుంచునే దర్శనమిస్తూ ఉంటాడు.

అందుకు పూర్తి భిన్నంగా స్వామి పడుకుని దర్శనమిచ్చే క్షేత్రం కూడా వుంది. ఆశ్చర్యచకితులను చేసే ఆ విశిష్టమైన క్షేత్రం, మహారాష్ట్రలోని 'ఖుల్తాబాద్' లో నెలకొని వుంది. 'భద్రమారుతి' పేరుతో పిలవబడే ఇక్కడి హనుమంతుడిని స్వయంభువుగా చెబుతుంటారు. పూర్వం శ్రీరాముడిని అమితంగా ఆరాధించే ఓ భక్తుడు, ఓ రోజున తనని తాను మరిచిపోయి భజన చేయసాగాడు.

ఆ భజన హృదయాన్ని తాకడంతో హనుమంతుడు వచ్చి అక్కడ నాట్యం చేసి అలసిపోయి పడుకున్నాడట. చాలా సేపటి తరువాత ఇది గమనించిన ఆ భక్తుడు, హనుమంతుడి పాదాలపై పడ్డాడు. దాంతో ఈ లోకంలోకి వచ్చిన హనుమంతుడు, తనకి అమితానందం కలిగేలా శ్రీ రాముడి భజన చేసినందుకు వరం కోరుకోమని అడిగాడు. లోక కల్యాణం కోసం ఆయన అక్కడ ఆవిర్భవించ వలసిందిగా ఆ భక్తుడు కోరడంతో స్వామి ఆ మనవిని మన్నించాడు.

ఈ కారణంగానే స్వామి ఇక్కడ శయన హనుమంతుడిగా దర్శనమిస్తుంటాడు. సువిశాలమైన ప్రదేశంలో అద్భుతమైన నగిషీలతో ఈ ఆలయం అలరారుతుంటుంది. ప్రాచీన కాలంనాటి ఇక్కడి స్వామిని ఎందరో రాజులు దర్శించి తరించినట్టు ఆధారాలు వున్నాయి. మహారాజుల నుంచి మామూలు భక్తుల వరకూ అందరూ ఇక్కడి స్వామి మహిమలను అనుభవపూర్వకంగా తెలుసుకున్న వారే. ఇక్కడి హనుమంతుడిని పూజించిన వారికి సమస్యలన్నీ తొలగిపోయి సకలశుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు. ●

# వయస్సు మీరుతున్నకొద్దీ ఎక్కువగా మాట్లాడాలి

వైద్యులు ఇలా అంటున్నారు. పదవీ విరమణ చేసిన వారు (సీనియర్ సిటిజన్లు) ఎక్కువగా మాట్లాడాలి, ఎందుకంటే జ్ఞాపకశక్తి కోల్పోకుండా నిరోధించడానికి ప్రస్తుతానికి మార్గం లేదు. ఎక్కువగా మాట్లాడటం ఒక్కటే మార్గం.

సీనియర్ సిటిజన్లు ఎక్కువగా మాట్లాడితే కనీసం మూడు ప్రయోజనాలు ఉన్నాయి.

మొదటిది: మాట్లాడటం మెదడును సక్రియం చేస్తుంది మరియు మెదడును చురుగ్గా ఉంచుతుంది, ఎందుకంటే భాష – ఆలోచన ఒకదానితో ఒకటి సంభాషించుకోవడం, ముఖ్యంగా త్వరగా మాట్లాడటం, ఇది సహజంగానే వేగంగా ఆలోచించే ప్రతిబింబాన్ని కలిగిస్తుంది మరియు జ్ఞాపకశక్తిని కూడా పెంచుతుంది. మాట్లాడని సీనియర్ సిటిజన్లు, జ్ఞాపకశక్తి కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రెండవది: మాట్లాడటం అనేది చాలా మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది, మానసిక అనారోగ్యాన్ని దూరం చేస్తుంది మరియు మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. మనం తరచుగా ఏమీ అనలేము, కానీ దానిని మన గుండెల్లో పాతిపెట్టి, మనల్ని మనం ఉక్కిరిబిక్కిరి చేస్తాము. ఇది నిజం! కాబట్టి! సీనియర్లుకు ఎక్కువ మాట్లాడే అవకాశం కల్పించడం మంచిది.

మూడవది: మాట్లాడటం వల్ల చురుకైన ముఖ కండరాలకు వ్యాయామం చేయవచ్చు. అదే సమయంలో, గొంతుకు వ్యాయామం చేయవచ్చు – ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది, అదే సమయంలో, ఇది కళ్ళు – చెవులు క్షీణించడాన్ని తగ్గిస్తుంది మరియు మైకము వంటి గుప్త ప్రమాదాలను తగ్గిస్తుంది. చెవిటితనం.

సంగ్రహంగా చెప్పాలంటే, రిటైర్ అయినవాళ్ళు, అంటే సీనియర్ సిటిజన్లు జనసాధ్యమైనంత వరకు ఎక్కువగా మాట్లాడటం మరియు వ్యక్తులతో చురుగ్గా సంభాషించడం, అల్జీమర్స్‌ను నివారించే ఏకైక మార్గం. దీనికి వేరే ఎటువంటి చికిత్స లేదు.

కాబట్టి, మనం ఎక్కువగా మాట్లాడదాం మరియు ఇతర సీనియర్లను కూడా బంధు మిత్రులతో ఎక్కువగా మాట్లాడేలా ప్రోత్సహిద్దామా. ●

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

"కృణ్వంతో మార్గదర్శి"

# మార్గదర్శి - ఆచార్య కొసరాజు

వ్యవసాయశాస్త్ర పరిశోధనా వ్యాసంగము, వైదిక జీవన విధానము రెండు కళ్లుగా గల **ఆచార్య కొసరాజు తిరుమలరావు** గారు 1935 సం॥ గాంధీ జయంతినాడు. వెంకట్రామయ్య-అన్నపూర్ణాదేవి పుణ్యదంపతులకు, కృష్ణా, జిల్లా, కురుమద్దాలి గ్రామంలో జనియించారు. వ్యవసాయ శాస్త్రంలో ఉన్నతవిద్య నభ్యసించి, డాక్టరేట్ పొంది, కీటక శాస్త్రంలో ఆచార్యునిగా ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, హైదరాబాద్, లాం, బాపట్ల కేంద్రాలలో పనిచేశారు. తాను పరిశోధించిన విషయాలను స్వయంగా ఆచరించి సత్ఫలితాలను పొంది, విద్యార్థులకు తెలియజేసి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దారు. కేవలం విషయజ్ఞానానికి ప్రాధాన్యతనీయక ప్రయోగాత్మక జ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేసి తనకంటూ వృత్తిపరంగా ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. వీరిచే తీర్చిదిద్దబడ్డ శిష్యులు ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వివిధ దేశాలలో ప్రఖ్యాతిని పొందారు.

ఎవరికైనా పదవీ విరమణ చేశాక విశ్రాంత జీవనంలో పేర్కొనదగిన విషయాలు పెద్దగా ఉండవు. కానీ వీరి విషయంలో విశ్రాంత జీవనాన్ని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. విశ్రాంతి జీవనంలో సేంద్రీయ వ్యవసాయానికి శ్రీకారంచుట్టి, పురుగు మందులతో పనిలేకుండా అధిక దిగుబడి పొందవచ్చునని పరిశోధించి, ఆచరించి తత్ఫలితాలను రైతులకు తెలియ జేశారు. దీర్ఘకాలిక వ్యాధులను ప్రకృతి, ఆయుర్వేద వైద్యముల ద్వారా తగ్గించి ప్రజాభిమానాన్ని పొందారు. గోసంరక్షణ వీరి ప్రధాన వ్యాసంగాలలో ఒకటి.

1965 ప్రాంతంలో ఉద్యోగరీత్యా తెనాలిలో ఉన్నప్పుడు పండిత గోపదేవ్ గారి ఉపన్యాసముల ద్వారా ఆర్యసమాజమునకు ఆకర్షితులై, వేదాధ్యయనం చేసి ఆర్యసమాజ సిద్ధాంతాల ప్రచారానికి కృషిచేసి, గోపదేవ్ గారి ముఖ్య శిష్యులైనారు. అప్పటి నుండి నిత్యాగ్నిహోత్రులై, ధర్మాచరణ, సత్యవ్రతములను పాటిస్తూ ఆదర్శ జీవనం గడిపారు. నిరాడంబరత, నిర్మలత, నిర్భీతి లక్షణాలకు వీరు ప్రతీక. ఉద్యోగ విరమణ తరువాత వినుకొండ సమీపంలోని కొచ్చర్ల గ్రామంలో మహర్షి దయానంద ఆశ్రమమును స్థాపించి అందులో బాలబాలికల కొరకు గురుకులాన్ని ఏర్పాటుచేశారు. బాలబాలికలు గురుకులంలో చేరునట్లు ప్రోత్సహించారు. ఆశ్రమంలో గోశాలను నిర్వహిస్తూ, పండ్లతోటలను పెంచేవారు. ఆర్యసమాజ సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ, అగ్నిహోత్ర ప్రాధాన్యతను పామరులకు తెలియజేసి వారిచే నిత్యం అగ్నిహోత్ర చేయించేవారు. వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుచున్న సందర్భంలో వేదానుసారంగా వర్షేష్టి యజ్ఞాలను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించి, రైతులకు పంట నష్టం కాకుండా సకాలంలో వర్షాలను కురిపించి రైతుల పాలిట పెన్నిధిగా నిలిచారు.

పంటలపై రైతులకు ఉచిత సలహాలనిస్తూ తోడ్పడేవారు. ఆశ్రమానికి వచ్చిన వారికి యోగాసనాలు నేర్పించి, వారి ఆరోగ్యం ఎడల శ్రద్ధ చూపేవారు. జీవితాంతం భోగమార్గమును వీడి త్యాగమార్గమును అనుసరించిన ధన్యజీవి. గుంటూరులోని ఆర్యసమాజమునకు మరియు రాష్ట్ర పతంజలి రైతు విభాగానికి అధ్యక్షులుగా సేవలందించారు. తానా సభలలో పాల్గొని రైతు సమస్యలను వివరించి, ఆధ్యాత్మికంగా ఎలా జీవితం గడపాలో తెలియజేశారు. వృత్తిపరంగాను, ఆధ్యాత్మికపరంగాను విశేషమైన సేవలందించిన వీరు ది.1-7-2020 - ఏరువాక పౌర్ణమినాడు దివంగతులైనారు. వారు లేని లోటు పూడ్చలేనిది. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ఓదార్పునివ్వాలని ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

**ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.**

**- శ్రీ ఏలూరి సూర్యనారాయణ**

# గురు సందేశం

**ఒ**క రోజు గురువు గారు తన ప్రియ శిష్యుడితో దగ్గరలోనున్న ఒక అడవికి వెళ్లాడు. నడుస్తూ నడుస్తూ ఒకచోట గురువు గారు ఆగిపోయాడు. దగ్గరలోనున్న నాలుగు మొక్కలను ఆయన చూశాడు. అందులో ఒకటి అప్పుడే ఆకులు తొడుగుతున్న చిన్న మొక్క, రెండవది కొంచెం పెద్ద మొక్క, మూడవది దానికన్నా కొంచెం పెద్దది, నాల్గవది చాలా పెద్ద చెట్టు.

గురువు గారు తన శిష్యుణ్ణి పిలిచి మొదటి మొక్కను చూపుతూ దానిని లాగేయమన్నాడు. ఆ పిల్లవాడు తేలికగా ఆ మొక్కను లాగేశాడు. ఇప్పుడు రెండో మొక్కను కూడా లాగేయమన్నాడు. ఆ పిల్లవాడు కొంత కష్టపడి దానిని కూడా లాగేశాడు. బాగా ఎదిగిన చెట్టును చూపుతూ ఇప్పుడు దీన్ని లాగేయడానికి ప్రయత్నించమన్నాడు. ఆ పిల్లవాడు ఆ చెట్టు చుట్టూ రెండు చేతులు వేసి ప్రయత్నించినా చెట్టును కదిలించలేకపోయాడు. అయినా ప్రయత్నం చేస్తున్న ఆ శిష్యుడితో గురువు గారు ఇలా అన్నాడు. 'చూడు నాయనా! మన అలవాట్ల విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. చెడు అలవాట్లు. పాతబడిపోతే వాటిని మార్చుకోవడం చాలా కష్టం. మొక్కై వంగనిది మానై వంగునా? అన్నది సామెత. ఈ విధంగానే ఎంత ప్రయత్నించినా ఆ అలవాట్లు మనల్ని వదిలిపోవు.'

**భార్య యనెడు నొక్క భారమ్ము లేనిచో**
**పుల్లియాకువోలే పురుషుడెగురు**
**దారి తప్పనీని దైవమ్ము భార్యరా**
**విశ్వదాభిరామ వినురవేమా!**

-బేతవోలు రామబ్రహ్మం గారు వేమన పద్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని చెప్పిన పద్యం.

భావమేంటయ్యా అంటే, భర్త ఎంగిలి విస్తరాకు వంటివాడు, ఆకుపై బరువు వంటిది భార్య. బరువు లేకుంటే ఆకు ఎగిరిపోతుంది, స్థిరంగా వుండదు, అలాగే భార్య లేకపోతే మగాడు స్థిరత్వాన్ని కోల్పోతాడు. మగవాడు దారి తప్పకుండా సక్రమ మార్గంలో వుంచేదే భార్య. జీవితాన్ని చక్కదిద్దే దేవత వంటిది భార్య.






## మహోన్నత సత్యాలను అల్ప విషయాలతో పోల్చకూడదు. - స్వామి వివేకానంద



## జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

# ‘సనాతనధర్మం’ సంయమనం పాటించడం వల్లనే దేశంలో అనేకమతాలు పుట్టుకొచ్చాయ్

Let Us Be Thankful For The Fools, But For Them The Rest of Us Could Not Succeed అన్నాడు. మార్క్ ట్వేన్ అనే ఆంగ్ల వ్యంగ్య కథా రచయిత. ఈయన ఆంగ్లంలో వ్రాసిన కొన్ని నవలలను ఆనాడు ఆంధ్రపత్రికకు చెందిన ఆంధ్ర గ్రంథమాల వారు ఆంధ్రీకరింపచేసి ప్రచురించారు. ప్రజాస్వామ్యయుగం వచ్చిన తరువాత అధిక ఓట్లను సంపాదించినవాడే పాలనామూర్తి యవుతున్నాడు. వాడు సమర్ధుడా, అసమర్ధుడా, యన్నది ఎవరికీ అవసరంలేదు. అధికారు పార్టీలను పడగొట్టడం కోసం, ప్రత్యర్థి పార్టీలవారైతే, అధముడైనా సరే వాడికే “సై’ యంటున్నారు. విద్య, విజ్ఞానం, వివేకం, మేధస్సూ అన్నవాటిని రిజర్వేషన్లు’ వచ్చి, కుప్పతొట్టిలోనికి తోసి వేసాయ్. పేదరికం తొలగిస్తామంటూ ఉన్న మధ్యతరగతి ప్రజలను కూడా పేదరికంలోకి మెడబట్టి తోసేస్తున్నారు. ‘పంచతంత్రం’ కథలోని కొంగలా, కథలు చెప్పి, జపాలు చేసేవారేగానీ, ప్రజా సదుపాయాలు ఏ ఒక్కరికీ, పట్టినట్టు కనిపించదు. వార్షిక బడ్జెట్ వస్తుందంటే చాలు, ప్రజలు గడగడా వణికి పోతున్నారు. పైగా ప్రజలు హర్షిస్తున్నారనీ, ప్రజలు తమ వెనుక ఉన్నారనీ, దబాయించినట్టు నాయకులు చెప్పేస్తున్నారు. ప్రజలు ఎక్కడున్నారు. ఎవరి వెనుక ఉన్నారు. అసలు ప్రజలు ఎవరు? అనే విషయం అంతబట్టడంలేదు.

భారతదేశంలో ‘మతము’ అనేదిలేదనీ, మనుష్యుడెలా మసలుకోవాలో తోటి మనిషితో యెలా మెలగాలో, జీవరాశినెలా సంరక్షించాలి. ప్రకృతినెలా కాలుష్య రహితంగా కాపాడుకోవాలో, శాస్త్రాధ్యయనం యెలా చేయాలో, శాస్త్రానుగుణంగా నడుచుకొనే విధంఏదో, ప్రగతిని సాధించి, ప్రతిభను పొందేవిధం ఎట్టిదో, కుటుంబ వ్యవస్థనెలా పటిష్టపరుచుకోవాలో, వృత్తుల రీత్యా ప్రజలు ఒకరి కొరకు యెలా తోడుకావాలో నన్నది ‘సనాతనధర్మం’ నేర్పింది. ధర్మంలోనే సహనమూ, సౌశీల్యాలను వివరించి చెప్పింది. నిరంతరమూ అధ్యయనం చేస్తూ, సంయమనం పాటించనున్నది.

ఈ సంయమనం కారణంగానే భారతదేశంలో పలుమతాలు. పుట్టు కొచ్చాయ్ దేశాల నుంచి పలు మతాల్ని పట్టుకొచ్చాయ్! మతం, కులం అనేవి ప్రజల్ని విడగొట్టే సాధన ప్రక్రియలు హిందూ మతం అనేది కూడా యీ అన్యమతాలను జూచి పేరిడుకున్న మతమే!

నిజం చెప్పాలంటే యీ ‘హిందూ’ పదం మనది కాదు. కొందరు చరిత్రకారులు ‘సింధూ’ శబ్దాన్నుంచీ ‘హిందూ’ పుట్టిందన్నారు. పురాణాన్ని తిరగవేసినా, వేదోపనిషత్తులను ఔపోషన పట్టిన వారిని ప్రశ్నించినా, ‘హిందూ’ అనే పదం ఎక్కడా కానరాదు, జనపదాల్లో కూడా లేదు. అమెరికాలోని ‘హిందూయిజమ్’ అని ప్రచురించిన ఆంగ్ల గ్రంథాలను చదివాను. ISCON, Barsanadham వారి పుస్తకాల్ని చదివాను. వారు, సనాతన ధర్మాన్ని గురించి వ్రాశారుగానీ, హిందూ అనే పదం లేదన్నారు. ముస్లిములన్న ‘హిందు’ శబ్దాన్ని ఆంగ్లేయులన్న ‘ఇండియా’ పదాన్ని మనం కౌలుకు తీసుకున్నాం. అదే పదాన్ని. దేశ నామకరణంగా చేసుకుని, “హిందూమతం’ అనేదాన్ని మనదనే. నామధేయంగా భ్రమపడ్డాం. జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే, మేరూ: దక్షిణ దిగ్భాగే అని ప్రవరను చదువుకుంటున్న విజ్ఞులకు కూడా బుద్ధిలేకపోవడం, బుద్ధి రాకపోవడం విచారకరంగా ఉంది. మనదేశం, మన విధానం, మన సంస్కృతి, సాంప్రదాయాలకు సంబంధం లేని రాజకీయ పార్టీలు, తమ ఉనికిని పెంచుకోవడం. కోసం, ‘సెక్యులరిజమ్’ అనే స్పెషల్ పదాన్ని ప్రయోగించి, దేశ సార్వభౌమత్వాన్ని చేధించాలని ప్రయత్నిస్తూంటే, కౌరవసభలో, ద్రౌపది బట్టలు ఊడదీస్తున్నపుడు చేతులు ముడుచుకుని. చూస్తున్న ధర్మమూర్తుల్లా కూర్చుని, వీక్షిస్తున్నాం.

ఆచార్యదేవోభవా, అతిధి దేవోభవా. మాతృదేవోభవా, పితృదేవోభవా అనే మాటలు కూడా విస్మరించి, ఇతర దేశాధినేతలు మనదేశం వచ్చినపుడు ఆతిధ్యం యివ్వకపోగా.. నల్లజెండాలను చూపించడం, గడ్డిబొ మ్మలను దగ్ధం చేయడం (యీ పశుఘాతకాన్ని జూచి పశువులెంత ఆక్రోశిస్తున్నాయో) బంద్ లు పాటించడం చూస్తే, జుగుప్సాభావం కన్నా, జాలే కలుగుతుంది. ఏవిటీ భారత ప్రజలు యింతటి నీచాతినీచ స్థితికి దిగజారిపోయారు, వీళ్ళకి జ్ఞానం యెపుడు వస్తుంది? జ్ఞానవంతులై, దేశాన్ని దేశసంపదల్నీ యెపుడు పెంపుచేసుకొని, ఉత్తమ పౌరులుగా వ్యవహరిస్తారన్న సంశయం కలుగుతున్నది. దేశానికి స్వాతంత్రం రాకపూర్వమున్న సమైక్యతాభావం ఏ మయింది? ఒకరినొకరు చంపుకునే విధానాన్ని, రైళ్ళు, బస్సులూ, భవనములూ వంటి వసతుల్ని కల్పించుకున్న సౌభాగ్యాన్ని నాశనంచేస్తున్న వీరి అవివేకత్వానికి ఎప్పుడు విరామం కలుగుతుంది? దేశం ఎపుడు సుస్థిరశాంతి సంపదలను విరబూయింపచేస్తుంది? శుభకృత్ నామ సంవత్సరమా, నీ అపార, అమేయ, అజేయ, విక్రమ పరాక్రమాన్ని జూపుమా! అంటూ అన్ని శుభాలే కలగాలని ప్రార్థిద్దాం. ●

## తెలుగువారు బహు పరాక్!

**‘బ్రతికినన్నాళ్ళు దుర్భరాపదల గుడిపి చచ్చినంతనె ఆత్మకు శాంతి పల్కి వీరపూజలు గావించు వెర్రి తనము తెలుగుదద్దమ్మకే సమృద్ధిగా లభించే’.**

అన్నారు ‘తెలుగులెంక’ కవి శ్రీ తుమ్మలవారు. బ్రతికుండగా బలుసాకుతిని ఇతురులకు వెలుగైనవాడు క్రొవ్వత్తిలా హరించుకొని పోవడమే తప్ప వారికి ‘తులసి తీర్థం’ కూడా పోయరు. చచ్చిన తరువాత వారి ఆత్మకు శాంతి వచనాలు పలుకుతూ వీరపూజలు చేసేవారు మన తెలుగువారు. వారి ఆశయాలను ఆలా వీరపూజలతోనే వారి పనిని సరిపెట్టుకొంటారే తప్ప, మరుసటి రోజునుంచీ ఆచరించే ప్రక్రియకుపక్రమించరు. ఇది ‘గునుపూడి జంగముల’ సామ్యంలా ఉంటుంది. ఈ తప్పిదాన్ని యిప్పటికైనా తెలుగువారు గ్రహించి, తెలుగునభివృద్ధి పరచడం అవసరం. ఈ కార్యక్రమాన్ని ఎక్కడెక్కడున్నా తెలుగువారు యుద్ధ ప్రాతిపదికను చేబడితేనే తెలుగుకు ప్రయోజనం చేకూరుతుందని గ్రహించండి!!

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే




**329 నెలలుగా**
**329 సంచికలను**

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.25000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు


చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**May 2022**






**The One Stop solution for all your Printing Needs**

**GOTETI GRAPHICS**

64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA

✆ : **098400 48941** E-mail : **gotetigraphics@gmail.com**

***Our print support creates a remarkable value in your business***